RNI NO: APTEL/25/A0108
www.mahinewsindia.com

# మహి న్యూస్

MAHI NEWS
Epaper: https://epaper.mahinewsindia.com
తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను
మహి న్యూస్
ఆంధ్రప్రదేశ్‌లో వెలువడుతున్న మహి న్యూస్ తెలుగు దినపత్రికకు ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ, మండలాల విలేకరులు కావలెను. తెలుగు భాష మీద కనీస అవగాహన కలిగివుండి, వార్తలను రాయగలిగి ఉన్న వారికి, వార్తలను టైపు చేయగలిగి ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.
-: సంప్రదించండి :-
9059585898

ఆంధ్రప్రదేశ్,తెలంగాణ. సంపుటి : 02 సంచిక : 136, ఎడిటర్ : నీలి రాముసుబ్బయ్య, పేజీలు : 8, వెల రూ. 2, /- ఆదివారం -16 - ఆగష్టు - 2026

published From :YSR Kadapa circulated by Kurnool I Anatapuram I Chittoor I East & West Godavari I Guntur I Krishna I Nellore I Srikakulam I Visakhapatnam I Vijayanagaram I Prakasham & Hyderabad & Telangana

## వికసిత్ భారత్ సంకల్పంలో ఏపీ తన పాత్ర పోషిస్తుంది: డిప్యూటీ సీఎం పవన్



కాకినాడలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న పవన్ కల్యాణ్

ప్రపంచానికి నాయకత్వం వహించే స్థాయికి భారత్ ఎదుగుతోందని వ్యాఖ్య

## భారత్ తనకంటూ ప్రత్యేక గౌరవాన్ని సంపాదించుకుంది: పుతిన్



భారత్ ప్రగతిని ప్రశంసించిన పుతిన్

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా భారత్‌కు శుభాకాంక్షలు

భారత్-రష్యా బంధం మరింత బలపడుతుందని వ్యాఖ్య

ఐఎస్ఎస్ నుంచి రష్యా వ్యోమగాముల శుభాకాంక్షలు

భారత్-రష్యా అంతరిక్ష బంధాన్ని గుర్తుచేసిన కికీనా

## ఎర్రకోట నుంచి ప్రధాని వరాల జల్లు.. యువత, టెక్నాలజీ, క్రీడలే లక్ష్యంగా కీలక ప్రకటనలు



80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రధాని కీలక ప్రకటనలు

పోటీ పరీక్షలకు ఉచిత ఆన్‌లైన్ కోచింగ్ అందిస్తామని హామీ

## ఏడాదిలో 87 కోట్లకు పైగా ఉచిత ప్రయాణాలు,

# రూ.3,095 కోట్ల వ్యయం

### ఏపీలో రోజూ 24 లక్షల మంది మహిళల ఉచిత ప్రయాణం

- ‘స్త్రీ శక్తి’కి ఏడాది పూర్తి.. ఏడాది పూర్తి చేసుకున్న స్త్రీ శక్తి ఉచిత బస్సు ప్రయాణ పథకం
- ప్రతిరోజూ సగటున 24 లక్షల మంది మహిళలు వినియోగం
- మహిళా ప్రయాణికులతో కలిసి ఆర్టీసీ బస్సులో ప్రయాణించిన సీఎం చంద్రబాబు



అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీయే ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ‘స్త్రీ శక్తి’ ఉచిత బస్ ప్రయాణ పథకం విజయవంతంగా ఏడాది పూర్తి చేసుకుంది. ఈ పథకం ద్వారా రాష్ట్రంలో రోజుకు సగటున 24 లక్షల మంది మహిళలు ఉచితంగా ప్రయాణిస్తున్నారని ప్రభుత్వం వెల్లడించింది. పథకం తొలి వార్షికోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు (ఆగస్టు 15) ఆర్టీసీ బస్సులో ప్రయాణించి, లబ్ధిదారులైన మహిళలతో ముచ్చటించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల అనంతరం అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక ఆర్టీసీ బస్సు ఎక్కి, అందులో ప్రయాణిస్తున్న మిగతా 2 లో



## విశిష్ట సేవలు అందించిన సిబ్బందికి పతకాలు అందించిన మంత్రి లోకేశ్

- విజయవాడలో జాతీయ జెండాను ఆవిష్కరించిన మంత్రి నారా లోకేశ్
- పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన మంత్రి
- ప్రభుత్వ శాఖల ప్రగతిని వివరిస్తూ సాగిన శకటాల ప్రదర్శన
- అలరించిన విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, విన్యాసాలు
- విశిష్ట సేవలు అందించిన సిబ్బందికి పతకాలు అందజేత



## తిరుమలలో రద్దీ ఎక్కువగా ఉంది.. భక్తులు పరిస్థితిని గమనించి రావాలి

## టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు

భక్తులకు అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్న టీటీడీ చైర్మన్

వారాంతపు సెలవులతో తిరుమలకు పోటెత్తిన భక్తులు

సర్వదర్శనానికి సుమారు 18 నుంచి 20 గంటల సమయం

వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లు నిండి శిలాతోరణం వరకు చేరిన క్యూలైన్లు



## జెన్-జీ శక్తితోనే మార్పు.. అవినీతి, కులాలపై పోరాటమే నిజమైన స్వేచ్ఛ

- తొలి స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో విజయ్
- చెన్నైలోని చారిత్రాత్మక ఫోర్ట్ సెయింట్ జార్జ్‌లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు
- అవినీతిని అంతమొందించడం రెండో స్వాతంత్ర్య పోరాటం లాంటిదేనన్న విజయ్
- స్వాతంత్ర్య సమరయోధుల పింఛనును రూ. 23 వేలకు పెంచుతున్నట్లు ప్రకటన

## 2047 నాటికి స్వర్ణాంధ్ర సాధన కోసం ఐక్యంగా పనిచేద్దాం

### వికాసం నుంచి వైభవం వైపు ఏపీ: సీఎం చంద్రబాబు

- 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా అమరావతిలో సీఎం చంద్రబాబు ప్రసంగం
- గత పాలనలోని విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని వికాసం వైపు నడిపిస్తున్నామన్న సీఎం
- రూ.24 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు, వచ్చే ఏడాది పోలవరం పూర్తిపై హామీ
- వివిధ శాఖల శకటాల ప్రదర్శన, ప్రతిభావంతులైన పోలీసులకు పతకాల ప్రదానం



అమరావతి: 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో అత్యంత ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ముఖ్యమంత్రి చంద్రబాబు మిగతా 2 లో

## బ్రిటీష్ కాలం నాటి కుట్రలు నేటి తరానికి తెలియాల్సిన అవసరం ఉంది

### చరిత్రను అర్థం చేసుకున్నవారే దేశ భవిష్యత్తును అద్భుతంగా నిర్మించగలరు

- బ్రిటీష్ వారి విధానాల వల్లే దేశంలో కుల వ్యవస్థ మరింత తీవ్రమైందని వ్యాఖ్య
- ఆదివాసీలను రాజ్యం పరిధిలోకి తెచ్చి తీరని అన్యాయం చేశారని మండిపాటు



హైదరాబాద్: ఆంగ్లేయుల పాలనలో జరిగిన దారుణాలు, సమాజాన్ని ముక్కలు చేయడానికి వారు అవలంబించిన ‘విభజించి పాలించే’ కుట్రల గురించి నేటి తరానికి పూర్తి స్థాయిలో తెలియాల్సిన అవసరం ఉందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత మిగతా 2 లో

# తెలంగాణను విధ్వంసం నుంచి వికాసం వైపు నడిపిస్తున్నాం

### గోల్కొండలో జాతీయ జెండాను ఎగురవేసిన సీఎం రేవంత్ రెడ్డి

- ఆయుధం లేకుండా అహింసతో స్వాతంత్ర్యం సాధించామని వ్యాఖ్య
- దెబ్బతిన్న వ్యవస్థలను32 నెలల్లో గాడిలో పెట్టామని ప్రకటన
- తెలంగాణ తలసరి ఆదాయం దేశం కంటే 91 శాతం అధికమని వెల్లడి
- రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని సీఎం వ్యాఖ్య
- బలమైన ప్రజాస్వామిక భారత్ నిర్మాణానికి పిలుపు



హైదరాబాద్: గోల్కొండ కోటలో జరిగిన 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొని జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ప్రపంచ చరిత్రలోనే ఆయుధం లేని యుద్ధం భారత స్వాతంత్ర్య మిగతా 2 లో



## ఆయన చెప్పింది నిజమే'.. రాజగోపాల్ రెడ్డికి కేటీఆర్ మద్దతు!

- అవినీతిపై రాజగోపాల్ రెడ్డి తీవ్ర ఆరోపణలు
- రూ.5 లక్షల ఇంటికి 500 నిబంధనలంటూ మండిపాటు
- భారీ దోపిడీ జరుగుతోందని ఆరోపణ
- రాజగోపాల్ మాటలతో ఏకీభవిస్తున్నానన్న కేటీఆర్
- కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ విమర్శలు

హైదరాబాద్: కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చేసిన తీవ్ర ఆరోపణలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మద్దతు మిగతా 2 లో



## 22ఏ పేరుతో భారీ దోపిడీ జరుగుతోంది బండి సంజయ్

- నిషేధిత భూముల ముసుగులో భారీ దోపిడీ జరుగుతోందన్న బండి సంజయ్
- ఏకంగా 95 లక్షల ఎకరాలను నిషేధిత జాబితాలో ఎలా చేరుస్తారని ప్రశ్న
- ప్రభుత్వం వేలం వేసిన భూములను కూడా ఈ జాబితాలో చేరుస్తున్నారని విమర్శ

# తెలంగాణను విధ్వంసం నుంచి వికాసం వైపు నడిపిస్తున్నాం: సీఎం రేవంత్

మొదటి పేజి తరువాయి

ప్రపంచ చరిత్రలోనే ఆయుధం లేని యుద్ధం భారత స్వాతంత్ర్య పోరాటమని అన్నారు. అహింసతోనూ విజయాన్ని సాధించవచ్చని మహాత్మాగాంధీ నిరూపించారని చెప్పారు. దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ అభివృద్ధికి బలమైన పునాదులు వేశారని పేర్కొన్నారు. స్వాతంత్ర్యం జీవనానికి ఆధారమని, దానికి వెల కట్టలేమని గాంధీజీ చెప్పారని రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. హరిత విప్లవం, శ్వేత విప్లవం, నీలి విప్లవం ద్వారా దేశంలోని వివిధ రంగాల అభివృద్ధికి గత ప్రభుత్వాలు కృషి చేశాయని అన్నారు. తెలంగాణ ప్రజలకు స్వేచ్ఛను అందించడంతో పాటు విధ్వంసకర పాలన నుంచి రాష్ట్రాన్ని వికాసం వైపు తీసుకెళ్లేందుకు తమ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని చెప్పారు. తెలంగాణ భవిష్యత్తుకు అవసరమైన కార్యాచరణను సిద్ధం చేసుకుని ముందుకు సాగుతున్నామని వెల్లడించారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 32 నెలలు పూర్తయ్యాయని సీఎం తెలిపారు. దెబ్బతిన్న వ్యవస్థలను ఒక్కొక్కటిగా గాడిలో పెడుతున్నామని చెప్పారు. తమ సంక్షేమ పథకాలను కేవలం ఆర్థిక లెక్కలతో చూడటం లేదని స్పష్టం చేశారు. సంక్షేమంలో మానవీయత ఉందని, పేదల పట్ల బాధ్యత ఉందని అన్నారు. వారి జీవితాల్లో ఆనందం నింపాలన్న తపనతో కార్యక్రమాలను అమలు చేస్తున్నామని చెప్పారు. ఓట్ల కోసం లేదా మొక్కుబడిగా సంక్షేమాన్ని అమలు చేయడం లేదని స్పష్టం చేశారు. 32 నెలల్లో ప్రభుత్వం చేసిన కృషి ఫలితాలు ఇప్పుడు కనిపిస్తున్నాయని రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ తలసరి ఆదాయం పెరగడం దీనికి ఉదాహరణగా పేర్కొన్నారు. దేశ తలసరి ఆదాయంతో పోలిస్తే తెలంగాణ తలసరి ఆదాయం 91 శాతం అధికంగా ఉందని చెప్పారు. రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందన్నది తమ ప్రభుత్వ నమ్మకమని తెలిపారు. రైతుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తూ రాష్ట్ర అభివృద్ధిని ముందుకు తీసుకెళ్తున్నామని అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను సీఎం ఈ సందర్భంగా స్మరించుకున్నారు. భిన్నత్వంలో ఏకత్వాన్ని కాపాడుకోవాలని, పరస్పర గౌరవం, దేశభక్తి విలువలను పెంపొందించాలని పిలుపునిచ్చారు. అసమానతలు లేని, శాంతి, సౌభ్రాతృత్వాలతో కూడిన బలమైన ప్రజాస్వామిక భారతదేశాన్ని నిర్మించడమే సమరయోధులకు నిజమైన నివాళి అని అన్నారు. ప్రతి పౌరుడికి సమన్యాయం, సమానత్వం, స్వేచ్ఛ అందేలా నవభారత నిర్మాణంలో ప్రతి ఒక్కరూ కర్తవ్యనిష్ఠతో, అంకితభావంతో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

## బ్రిటీష్ కాలం నాటి కుట్రలు నేటి తరానికి తెలియాల్సిన అవసరం ఉంది: కవిత

హైదరాబాద్: ఆంగ్లేయుల పాలనలో జరిగిన దారుణాలు, సమాజాన్ని ముక్కలు చేయడానికి వారు అవలంబించిన 'విభజించి పాలించే' కుట్రల గురించి నేటి తరానికి పూర్తి స్థాయిలో తెలియాల్సిన అవసరం ఉందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత స్పష్టం చేశారు. మన చరిత్రను సరిగ్గా అర్థం చేసుకున్న వారు మాత్రమే దేశ భవిష్యత్తును అద్భుతంగా నిర్మించగలరని ఆమె అన్నారు. తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర కార్యాలయంలో ఘనంగా నిర్వహించిన 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో కవిత పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... రెండు ప్రపంచ యుద్ధాల్లో భారతీయ సైనికులను బలవంతంగా వాడుకుని వేలాదిమంది ప్రాణాలను బ్రిటీషర్లు బలితీసుకున్నారని మండిపడ్డారు. వారు తెచ్చిన విధానాల వల్లే దేశంలో కుల వ్యవస్థ మరింత తీవ్రతరమైందని, అడవుల్లో ప్రశాంతంగా జీవించే ఆదివాసీలను రాజ్యం పరిధిలోకి తెచ్చి తీరని అన్యాయం చేశారని ధ్వజమెత్తారు. బ్రిటీష్ పాలకులు దేశం విడిచి వెళ్లినా, వారి ఆలోచనా వైఖరి మాత్రం ఇంకా ఇక్కడే ఉండిపోవడం విచారకరమని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. ఇంగ్లీష్ మాట్లాడేవారే గొప్ప అన్నట్లుగా చూస్తూ, మాతృభాష అయిన తెలుగు మాట్లాడేవారిని తక్కువ చేసి చూడడం ఆనాటి గులాంగిరీకి నిదర్శనమన్నారు. చర్మం రంగును బట్టి మన మధ్య వైషమ్యాలు సృష్టించిన ఆనాటి మైండ్‌సెట్‌ను వీడి, స్వాతంత్ర్య సమరయోధుల ఆశయాలకు అనుగుణంగా ముందుకెళ్లాలని ఆమె పిలుపునిచ్చారు.

## భారత్ తనకంటూ ప్రత్యేక గౌరవాన్ని సంపాదించుకుంది: పుతిన్

ఢిల్లీ: భారత్ సాధిస్తున్న ప్రగతిని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రశంసించారు. ఆర్థిక, సామాజిక, శాస్త్ర, సాంకేతిక రంగాల్లో భారత్ అద్భుతమైన విజయాలు సాధిస్తోందని అన్నారు. ప్రపంచ వేదికపై భారత్ తనకంటూ ప్రత్యేక గౌరవాన్ని సంపాదించుకుందని పేర్కొన్నారు. భారత 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీకి పుతిన్ శుభాకాంక్షలు తెలిపారు. భారత్, రష్యా మధ్య సంబంధాలు ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్య స్ఫూర్తితో ముందుకు సాగుతున్నాయని పుతిన్ చెప్పారు. ఐక్యరాజ్యసమితి, ఎస్‌సీఓ, బ్రిక్స్ వంటి అంతర్జాతీయ వేదికల్లో రెండు దేశాలు కలిసి పనిచేస్తున్నాయని తెలిపారు. ఇరు దేశాల ప్రజల ప్రయోజనాల కోసం ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసేందుకు కృషి కొనసాగుతుందని పేర్కొన్నారు. అంతర్జాతీయ భద్రత, స్థిరత్వానికి కూడా ఈ భాగస్వామ్యం ఉపయోగపడుతుందని అన్నారు. భారత్ అభివృద్ధి ప్రయాణానికి రష్యా అండగా ఉంటుందని రష్యా రాయబారి డెనిస్ అలిపోవ్ చెప్పారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా భారత ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. భారత్ ముందుకు సాగుతున్న తీరును చూస్తే ప్రజల కలలన్నీ నెరవేరుతాయనే నమ్మకం ఉందన్నారు. రష్యా మద్దతు భవిష్యత్తులోనూ కొనసాగుతుందని స్పష్టం చేశారు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం నుంచి రష్యా వ్యోమగాములు ప్యోటర్ దుబ్రోవ్, అన్నా కికీనా, ఆంద్రే ఫెద్యాయెవ్ కూడా భారత ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. భారత్-రష్యా అంతరిక్ష సహకారాన్ని వారు గుర్తుచేశారు. 1975లో ఆర్యభట ఉపగ్రహ ప్రయోగంతో మొదలైన సహకారం 1984లో రాకేశ్ శర్మ అంతరిక్షయాత్రతో మరింత బలపడిందని కికీనా చెప్పారు. ప్రస్తుతం గగన్‌యాన్ కోసం భారత వ్యోమగాములకు రష్యాలో శిక్షణ ఇచ్చిన విషయాన్ని ప్రస్తావించారు. భారత్, రష్యా స్నేహం చిరకాలం కొనసాగాలని ఫెద్యాయెవ్ ఆకాంక్షించారు.

## విశిష్ట సేవలు అందించిన సిబ్బందికి పతకాలు అందించిన మంత్రి లోకేశ్

విజయవాడ: 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా వివిధ ప్రభుత్వ విభాగాల్లో విశిష్ట సేవలు అందించిన ఉద్యోగులు, సిబ్బందిని రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా సత్కరించింది. విజయవాడలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్, ఉత్తమ సేవలు అందించిన సిబ్బందికి వ్యక్తిగతంగా పతకాలు, ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. ప్రజాసేవలో అంకితభావంతో పనిచేస్తున్న వారిని గుర్తించి గౌరవించడం ప్రభుత్వ బాధ్యత అని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ అజిత్ సింగ్ నగర్‌లోని మాకినేని బసవపున్నయ్య స్టేడియంలో శనివారం జరిగిన ఈ వేడుకలు పండుగ వాతావరణంలో, అత్యంత వైభవోపేతంగా జరిగాయి. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి నారా లోకేశ్ ముందుగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పోలీస్, హోంగార్డ్, స్కౌట్స్ అండ్ గైడ్స్, ఎన్‌సీసీ, యూత్ రెడ్ క్రాస్ సహా పలు విభాగాల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. కవాతును పర్యవేక్షించి, ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుకల్లో భాగంగా నిర్వహించిన వివిధ ప్రభుత్వ శాఖల శకటాల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రాష్ట్ర ప్రభుత్వ పాలన, ప్రగతిని ప్రతిబింబిస్తూ వ్యవసాయం, వైద్యం, విద్య, పరిశ్రమలు, మహిళా శిశు సంక్షేమం, అటవీ, రవాణా, పౌర సరఫరాలు, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, జలవనరుల శాఖల శకటాలు కనువిందు చేశాయి. శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయం, ఏపీ విపత్తు స్పందన దళం, విజయవాడ నగరపాలక సంస్థ, పోలీస్ కమిషనరేట్ డ్రోన్ నిఘా విభాగం శకటాలు కూడా అందరినీ ఆకట్టుకున్నాయి. అనంతరం వివిధ పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, దేశభక్తి గీతాలకు చేసిన నృత్యాలు, విన్యాసాలు ఆహూతులను అలరించాయి. చిన్నారుల ప్రదర్శనలు స్వాతంత్ర్య స్ఫూర్తిని నింపాయి. కార్యక్రమం ముగింపులో, ముందుగా ప్రకటించిన విధంగా వివిధ శాఖలలో ఉత్తమ పనితీరు కనబరిచిన అధికారులను, ఉద్యోగులను, సిబ్బందిని మంత్రి నారా లోకేశ్ పేరుపేరునా అభినందించి, వారికి పతకాలు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, నగర ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## తిరుమలలో రద్దీ ఎక్కువగా ఉంది.. భక్తులు పరిస్థితిని గమనించి రావాలి

తిరుపతి: శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా టీటీడీ అన్ని ఏర్పాట్లు చేస్తోందని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు స్పష్టం చేశారు. తిరుమలలో భక్తుల రద్దీ గణనీయంగా పెరిగిన నేపథ్యంలో ఆయన ఈ ప్రకటన చేశారు. అయితే, భక్తులు తిరుమల రద్దీని దృష్టిలో ఉంచుకుని, తమ యాత్రను ముందుగా ప్రణాళిక చేసుకోవాలని సూచించారు. దర్శన సమయంలో సంయమనం పాటిస్తూ, టీటీడీ సిబ్బందికి సహకరించాలని ఆయన భక్తులకు విజ్ఞప్తి చేశారు. వారాంతపు సెలవులు కావడంతో తిరుమలకు భక్తులు భారీ సంఖ్యలో పోటెత్తారు. దీంతో వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని అన్ని కంపార్ట్‌మెంట్లు నిండిపోయి, క్యూలైన్లు వెలుపల శిలాతోరణం వరకు బారులు తీరాయి. ప్రస్తుతం దర్శన టికెట్లు, టోకెన్లు లేని సర్వదర్శనం భక్తులకు శ్రీవారిని దర్శించుకోవడానికి సుమారు 18 నుంచి 20 గంటల సమయం పడుతోంది. ఆగస్టు 14వ తేదీన మొత్తం 73,699 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 39,884 మంది తలనీలాలు సమర్పించగా, హుండీ ద్వారా రూ. 4.03 కోట్ల ఆదాయం లభించింది. అదేవిధంగా, టీటీడీ మొత్తం 4.31 లక్షల లడ్డూలను విక్రయించగా, 2.41 లక్షల మందికి పైగా భక్తులకు అన్నప్రసాదం అందించింది. భారీ రద్దీ ఉన్నప్పటికీ, భక్తులకు అవసరమైన అన్నప్రసాదం, తాగునీరు, వైద్య సేవలు వంటి సౌకర్యాలను టీటీడీ నిరంతరాయంగా అందిస్తోంది. శుక్రవారం ఒక్కరోజే అశ్విని ఆసుపత్రిలో 3,559 మందికి వైద్య సేవలు అందించినట్లు అధికారులు తెలిపారు. రద్దీని క్రమబద్ధీకరించేందుకు, భక్తుల నిరీక్షణ సమయాన్ని తగ్గించేందుకు టీటీడీ అధికారులు, సిబ్బంది నిరంతరం కృషి చేస్తున్నారు.

## ఆయన చెప్పింది నిజమే'.. రాజగోపాల్ రెడ్డికి కేటీఆర్ మద్దతు!

హైదరాబాద్: కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చేసిన తీవ్ర ఆరోపణలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మద్దతు తెలిపారు. అభివృద్ధి పేరుతో కొందరు అధికారాన్ని అడ్డుపెట్టుకుని రూ.లక్షల కోట్లు దోచుకుంటున్నారని రాజగోపాల్ చేసిన వ్యాఖ్యలతో తాను పూర్తిగా ఏకీభవిస్తున్నానని కేటీఆర్ అన్నారు. పేదలకు ఇల్లు కట్టుకోవడానికి రూ.5-6 లక్షలు ఇవ్వాలంటే ప్రభుత్వం 500 నిబంధనలు పెడుతోందని రాజగోపాల్ రెడ్డి విమర్శించారు. అదే సమయంలో పెద్ద మొత్తంలో దోపిడీ జరుగుతున్నా పట్టించుకోవడం లేదని ఆయన ధ్వజమెత్తారు. రాజగోపాల్ రెడ్డి ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వంపై నేరుగా విమర్శలు చేశారు. అభివృద్ధి పేరుతో రాష్ట్రాన్ని దోచుకుంటున్న వారిపై పోరాడతానని హెచ్చరించారు. తన సహనాన్ని చేతకానితనంగా భావించవద్దని అన్నారు. పేదల ఇళ్ల విషయంలో నిబంధనలు కఠినంగా పెడుతున్న ప్రభుత్వం భారీ అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఈ వ్యాఖ్యలపై కేటీఆర్ స్పందించారు. కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దలు వేల కోట్ల అవినీతికి పాల్పడుతున్నారన్న రాజగోపాల్ రెడ్డి మాటలు నిజమేనని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై అవినీతి ఆరోపణలను సొంత పార్టీ ఎమ్మెల్యేలే చేస్తున్నారని చెప్పారు. తెలంగాణను రాహుల్ గాంధీ, ఏఐసీసీకి ఏటీఎంగా మార్చుకున్నారంటూ తీవ్ర ఆరోపణలు చేశారు. తెలంగాణకు వచ్చిన ప్రతిసారీ ప్రధాని మోదీ రాష్ట్రం ఏఐసీసీకి ఏటీఎంగా మారిందని చెబుతున్నారని కేటీఆర్ గుర్తుచేశారు. మరి అలాంటి ఆరోపణలు వస్తున్నప్పుడు చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై ఈడీ దాడులు జరిగినా ఆ తర్వాత ఎలాంటి చర్యలు కనిపించలేదన్నారు.

# ఏడాదిలో 87 కోట్లకు పైగా ఉచిత ప్రయాణాలు, రూ.3,095 కోట్ల వ్యయం

మొదటి పేజి తరువాయి

ఈ పథకం ద్వారా రాష్ట్రంలో రోజుకు సగటున 24 లక్షల మంది మహిళలు ఉచితంగా ప్రయాణిస్తున్నారని ప్రభుత్వం వెల్లడించింది. పథకం తొలి వార్షికోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు (ఆగస్టు 15) ఆర్టీసీ బస్సులో ప్రయాణించి, లబ్ధిదారులైన మహిళలతో ముచ్చటించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల అనంతరం అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక ఆర్టీసీ బస్సు ఎక్కి, అందులో ప్రయాణిస్తున్న మహిళలతో మాట్లాడారు. పథకం అమలు తీరుపై వారి నుంచి నేరుగా అభిప్రాయాలు తెలుసుకున్నారు. వారి కుటుంబాలు, జీవనోపాధి, ఆరోగ్య పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ పథకం ద్వారా వారికి కలుగుతున్న ప్రయోజనాలను వివరించారు. ఎన్డీయే ప్రభుత్వం 'సూపర్ సిక్స్' హామీలలో భాగంగా 2025 ఆగస్టు 15న ఈ పథకాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ పథకం కింద ఆంధ్రప్రదేశ్‌కు చెందిన బాలికలు, మహిళలు, ట్రాన్స్‌జెండర్లు పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డినరీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చు. ప్రయాణ సమయంలో ఏపీకి చెందినవారని ధ్రువీకరించే గుర్తింపు కార్డు చూపించాల్సి ఉంటుంది. రాష్ట్రంలో ఎంత దూరమైనా, ఎన్నిసార్లైనా ప్రయాణించేందుకు ఎలాంటి పరిమితి లేదు. ప్రధాన పండుగల సమయంలో దేవాలయాలకు నడిపే ప్రత్యేక బస్సులకు కూడా ఈ సౌకర్యాన్ని వర్తింపజేశారు.

### గణనీయంగా పెరిగిన ప్రయాణికులు

ప్రభుత్వం విడుదల చేసిన గణాంకాల ప్రకారం, పథకం ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటివరకు 87 కోట్లకు పైగా ఉచిత ప్రయాణాలు నమోదయ్యాయి. పథకానికి ముందు రోజుకు సగటున 9.47 లక్షలుగా ఉన్న మహిళా ప్రయాణికుల సంఖ్య, ఇప్పుడు 24 లక్షలకు చేరింది. దీంతో ఆర్టీసీ మొత్తం ప్రయాణికుల్లో మహిళల వాటా 40 శాతం నుంచి 62 శాతానికి పెరిగింది. ఈ పథకం వర్తించే బస్సుల్లో ఆక్యుపెన్సీ రేటు 93 శాతానికి చేరుకోవడం విశేషం. ఏపీఎస్ఆర్టీసీకి చెందిన 9,978 బస్సుల్లో దాదాపు 7,631 బస్సుల్లో ఈ సౌకర్యం అందుబాటులో ఉంది.

భారీగా ప్రభుత్వ వ్యయం, పెరిగిన ఆదరణ

ఈ పథకం అమలు కోసం ప్రభుత్వం రోజుకు రూ.8.53 కోట్ల సబ్సిడీని భరిస్తున్నట్లు తెలిపింది. మొదటి ఏడాదిలో మొత్తం ఖర్చు రూ.3,095 కోట్లుగా నమోదైంది. 2026-27 బడ్జెట్‌లో కూడా ఈ పథకం కొనసాగింపు కోసం రూ.1,420 కోట్లు కేటాయించారు. ఈ పథకం వల్ల మహిళలకు రవాణా ఖర్చులు తగ్గడంతో పాటు విద్య, ఉపాధి, వైద్యం, వ్యాపారం వంటి అవసరాలకు సులువుగా ప్రయాణించే అవకాశం కలిగిందని ప్రభుత్వం పేర్కొంది. ఒక్కో లబ్ధిదారు కుటుంబానికి నెలకు సుమారు రూ.1,000 ఆదా అవుతుందని ఆర్టీసీ అధికారులు అంచనా వేశారు. ఈ పథకం వచ్చాక కొన్ని రూట్లలో ప్రైవేట్ వాహనాలు, షేర్ ఆటోల వాడకం తగ్గి ప్రభుత్వ రవాణాకు ఆదరణ పెరిగింది. అయితే, మహిళా ప్రయాణికుల సంఖ్య భారీగా పెరగడంతో ఆర్టీసీపై అదనపు భారం పడుతోంది. పెరిగిన డిమాండ్‌కు అనుగుణంగా అదనపు బస్సుల అవసరాన్ని అంచనా వేస్తున్నట్లు రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి గతంలో వెల్లడించారు. తెలంగాణలో 'మహాలక్ష్మి', కర్ణాటకలో 'శక్తి' పేరుతో ఇలాంటి పథకాలే అమలవుతున్నాయి. మహిళల అభివృద్ధి, వారి రవాణా ఖర్చులను తగ్గించడమే లక్ష్యంగా ఈ పథకాన్ని కొనసాగిస్తామని ప్రభుత్వం స్పష్టం చేసింది.

# 2047 నాటికి స్వర్ణాంధ్ర సాధన కోసం ఐక్యంగా పనిచేద్దాం

అమరావతి: 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో అత్యంత ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ముఖ్యమంత్రి చంద్రబాబు మువ్వన్నెల జెండాను ఎగురవేసి, పోలీసు గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి ఆయన స్ఫూర్తిదాయక ప్రసంగం చేశారు. రాష్ట్రాన్ని వికాసం నుంచి వైభవం వైపు, సుస్థిరత నుంచి స్వర్ణాంధ్ర దిశగా నడిపిస్తున్నామని, 2047 నాటికి స్వర్ణాంధ్ర సాధనకు ఐదున్నర కోట్ల మంది ఆంధ్రులు సంకల్పం తీసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

"భారతీయులకు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు వారికి హృదయపూర్వక స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు. దశాబ్దాల పోరాటం, ఎందరో మహనీయుల త్యాగఫలమే మన స్వాతంత్ర్యం. 80 ఏళ్ల క్రితం మన పెద్దలు కన్న కలలను సాకారం చేసి, 2047 నాటికి దేశాన్ని, రాష్ట్రాన్ని ప్రథమ స్థానంలో నిలబెడదాం. ఈ దేశానికి మనమేం ఇవ్వగలమని ఆలోచించడమే 'అనే నేను...' సంకల్పం. రాబోయే 20 ఏళ్లు దేశ భవిష్యత్తు కోసం పనిచేస్తామని ప్రతిజ్ఞ చేద్దాం. ప్రధాని మోదీ ఇచ్చిన వికసిత్ భారత్, మనం నిర్దేశించుకున్న స్వర్ణాంధ్ర లక్ష్యాలు వేర్వేరు కావు. ఐక్యంగా ఈ లక్ష్యాలను సాధిద్దాం" అని ముఖ్యమంత్రి ఉద్బోధించారు.

గత పాలన విధ్వంసం నుంచి పునర్నిర్మాణం వైపు

గత ఐదేళ్ల పాలనలో రాష్ట్రం అన్ని విధాలా విధ్వంసానికి గురైందని, వ్యవస్థలన్నీ నిర్వీర్యమయ్యాయని చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. "గత పాలకుల అహంకారం, అవినీతి, అరాచకాలతో రాష్ట్రం 30 ఏళ్లు వెనక్కి వెళ్లింది. ఆర్థికంగా కోలుకోలేని దెబ్బ తగిలింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పునర్నిర్మాణ బాధ్యతను స్వీకరించాం. గత 26 నెలల్లో విధ్వంసం నుంచి వికాసం వైపు, సంక్షోభం నుంచి స్థిరత్వం వైపు రాష్ట్రాన్ని నడిపిస్తున్నాం. హెల్తీ, వెల్తీ, హ్యాపీ ఏపీ సాధనే మా లక్ష్యం. ప్రజల మద్దతు, కూటమి ఐక్యత, కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రానికి కొత్త ఊపిరి పోశాం" అని తెలిపారు. పోలవరం, అమరావతి, విశాఖ స్టీల్ ప్లాంట్, రైల్వే జోన్ వంటి అన్ని అంశాల్లో కేంద్రం సహకరిస్తోందన్నారు. గత ప్రభుత్వ అప్పులను రీషెడ్యూల్ చేసి రూ.8,269 కోట్లు ఆదా చేశామని, రాష్ట్ర వృద్ధి రేటును 11.3 శాతానికి పెంచామని వివరించారు.

పెట్టుబడుల వెల్లువ, ఉద్యోగాల కల్పన

పారిశ్రామికవేత్తల్లో విశ్వాసం నింపేందుకు 28 కొత్త పారిశ్రామిక విధానాలు తీసుకొచ్చామని సీఎం తెలిపారు. "ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యం. ఇప్పటికే రూ.24 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు కుదరగా, వాటిలో రూ.14 లక్షల కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలిపాం. తద్వారా 11 లక్షల ఉద్యోగాలు వస్తాయి. గూగుల్ ఏఐ డేటా సెంటర్, ఆర్సెలార్ మిట్టల్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, దాల్మియా సిమెంట్, హీరో, రాయల్ ఎన్‌ఫీల్డ్ వంటి అనేక దిగ్గజ సంస్థలు రాష్ట్రానికి తరలివస్తున్నాయి. 36 రోజుల్లోనే ఆమ్కా డిఫెన్స్ ప్రాజెక్టుకు అనుమతులిచ్చి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను నిరూపించాం. యువత గ్లోబల్ లీడర్లుగా ఎదగాలి. మెగా డీఎస్సీ ద్వారా 15,941 ఉద్యోగాలు భర్తీ చేశాం. ఇకపై ఏటా డీఎస్సీ ఉంటుంది. ఇప్పటికే 10 వేల ఉద్యోగాలతో జాబ్ క్యాలెండర్ విడుదల చేశాం" అని సీఎం పేర్కొన్నారు.

వ్యవసాయం, సాగునీటి రంగాలకు పెద్దపీట

'అన్నదాత సుఖీభవ' కింద ప్రతి రైతుకు ఏటా రూ.20 వేలు అందిస్తున్నామని, వ్యవసాయంలో ఆధునిక టెక్నాలజీని ప్రవేశపెడుతున్నామని ముఖ్యమంత్రి అన్నారు. "లక్ష కోట్లతో రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా మారుస్తాం. మదనపల్లెలో త్వరలో హార్టికల్చర్ యూనివర్సిటీకి శ్రీకారం చుడతాం. ఆక్వా రైతులకు యూనిట్ విద్యుత్‌ను రూ.1.50కే అందిస్తున్నాం. గత 26 నెలల్లో సాగునీటి ప్రాజెక్టులపై రూ.25 వేల కోట్లు ఖర్చు చేశాం. మరో మూడేళ్లలో రూ.35 వేల కోట్లతో 36 ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు ఇరిగేషన్ క్యాలెండర్ విడుదల చేశాం. 30 ఏళ్ల కల అయిన వెలిగొండ ఫేజ్-1ను త్వరలో ప్రారంభిస్తున్నాం. వంశధార-నాగావళి అనుసంధానం 73 శాతం పూర్తయింది. వచ్చే ఏడాది పుష్కరాల నాటికి పోలవరం ప్రాజెక్టును జాతికి అంకితం చేస్తాం" అని హామీ ఇచ్చారు.

అభివృద్ధి, సంక్షేమంలో సమతుల్యత

రామాయపట్నం, మచిలీపట్నం, మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టుల నిర్మాణం శరవేగంగా జరుగుతోందని సీఎం వివరించారు. రాష్ట్రంలో రూ.64 వేల కోట్ల రైల్వే పనులు, రూ.38 వేల కోట్ల హైవే పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఐదున్నర కోట్ల ఆంధ్రుల ఆత్మగౌరవ ప్రతీకగా అమరావతిని ప్రపంచ స్థాయి నగరంగా నిర్మిస్తామన్నారు. మహిళా సాధికారతకు 'స్వయం బ్రాండ్', పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా ఇచ్చామని పేర్కొన్నారు. ఉచిత ఇసుక విధానం, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, నకిలీ మద్యంపై ఉక్కుపాదం వంటి చర్యలు తీసుకున్నామన్నారు. ఉద్యోగుల సంక్షేమం కోసం రూ.30,849 కోట్ల బకాయిలు చెల్లించామని, ప్రజా భద్రతలో పోలీసులకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చామని స్పష్టం చేశారు. 'ఈగల్ టాస్క్ ఫోర్స్' ద్వారా గంజాయి, డ్రగ్స్‌ను అణిచివేస్తున్నామని తెలిపారు. ఈ వేడుకల్లో భాగంగా ఏపీఎస్పీ, సీఆర్పీఎఫ్, కర్ణాటక పోలీసు దళాలు, ఎన్‌సీసీ, స్కౌట్స్ విద్యార్థులు నిర్వహించిన కవాతు ఆకట్టుకుంది. వ్యవసాయం, విద్య, వైద్యం, పారిశ్రామిక రంగాల్లో సాధించిన ప్రగతిని వివరిస్తూ వివిధ ప్రభుత్వ శాఖలు ప్రదర్శించిన శకటాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అనంతరం విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన పలువురు పోలీసు అధికారులకు, సిబ్బందికి ముఖ్యమంత్రి పతకాలను ప్రదానం చేశారు.

# ఎర్రకోట నుంచి ప్రధాని వరాల జల్లు.. యువత, టెక్నాలజీ, క్రీడలే లక్ష్యంగా కీలక ప్రకటనలు

ఢిల్లీ: 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రధాని నరేంద్ర మోదీ ఎర్రకోట వేదికగా దేశ ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా యువత, విద్య, టెక్నాలజీ, క్రీడలు, పౌర రక్షణ, సెమీకండక్టర్, అణుశక్తి వంటి కీలక రంగాల్లో పలు ప్రతిష్టాత్మక కార్యక్రమాలను ప్రకటించారు. దేశ భవిష్యత్‌ను తీర్చిదిద్దడంలో ఈ నిర్ణయాలు కీలకపాత్ర పోషిస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

పోటీ పరీక్షలకు ఉచిత ఆన్‌లైన్ కోచింగ్

పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు ఉచితంగా ఆన్‌లైన్ కోచింగ్ అందిస్తామని ప్రధాని మోదీ ప్రకటించారు. ఖరీదైన కోచింగ్ క్లాసుల వల్ల పేద, మధ్యతరగతి కుటుంబాలపై పడుతున్న ఆర్థిక భారాన్ని ఈ పథకం తగ్గిస్తుందని ఆయన తెలిపారు. "తమ పిల్లలను కోచింగ్‌కు పంపకపోతే అది తమ కుటుంబ ప్రతిష్టకు భంగమని చాలా మంది తల్లిదండ్రులు భావిస్తున్నారు. ఈ ఒత్తిడితో ఆర్థిక స్థోమత లేకపోయినా అప్పులు చేసి మరీ పిల్లలను కోచింగ్ సెంటర్లకు పంపిస్తున్నారు. ఈ భారాన్ని తగ్గించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నాం" అని మోదీ వివరించారు. దేశంలో ఉన్న డిజిటల్ మౌలిక సదుపాయాలు, నిపుణులైన ఉపాధ్యాయులను ఉపయోగించుకుని ఈ ఉచిత కోచింగ్ నెట్‌వర్క్‌ను నిర్మిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

క్రీడలు, ఒలింపిక్స్‌పై భారీ లక్ష్యాలు

క్రీడా రంగంలో భారత్ బలమైన శక్తిగా ఎదుగుతోందని, 2036 ఒలింపిక్స్‌కు ఆతిథ్యం ఇవ్వాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని మోదీ స్పష్టం చేశారు. అయితే, ఒలింపిక్స్‌లోని అనేక క్రీడాంశాల్లో కనీసం అర్హత కూడా సాధించలేకపోవడం విచారకరమని అన్నారు. ఈ పరిస్థితిని అధిగమించేందుకు దేశవ్యాప్తంగా క్రీడా ప్రతిభ అన్వేషణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. "5 నుంచి 15 ఏళ్లలోపు వయసున్న పిల్లల్లో క్రీడా నైపుణ్యాలను గుర్తించి, వారికి ప్రపంచస్థాయి శిక్షణ ఇస్తాం. 2036 నాటికి ఒలింపిక్స్‌లోని అత్యధిక ఈవెంట్లలో మన అథ్లెట్లు పాల్గొనేలా చూడటమే మా లక్ష్యం" అని మోదీ తెలిపారు.

### టెక్నాలజీ, వ్యూహాత్మక రంగాల్లో స్వయంసమృద్ధి

మారుతున్న ప్రపంచంలో చిప్స్ (సెమీకండక్టర్లు) ప్రాముఖ్యతను నొక్కిచెప్పిన ప్రధాని, ఈ రంగంలో భారత్‌ను స్వయంసమృద్ధం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. "ఇప్పటికే దేశంలో మూడు కీలకమైన సెమీకండక్టర్ ప్లాంట్లు ఏర్పాటయ్యాయి. రాబోయే 7-8 ఏళ్లలో మరో 5 నుంచి 8 కొత్త ప్లాంట్లు కార్యకలాపాలు ప్రారంభిస్తాయి" అని ఆయన వెల్లడించారు. దీనితో పాటు కోటి మంది యువతకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)లో నైపుణ్య శిక్షణ అందిస్తామని ప్రకటించారు. ఏఐ రంగంలో ప్రపంచానికి నాయకత్వం వహించే సత్తా భారత యువతకు అందించడమే ఈ కార్యక్రమ ఉద్దేశమని పేర్కొన్నారు. అణు విద్యుత్ రంగంలోనూ భారత్ భారీ లక్ష్యాలను నిర్దేశించుకుందని మోదీ తెలిపారు. 2047 నాటికి 100 గిగావాట్ల అణు విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. రాబోయే 6-7 ఏళ్లలో ఐదు కొత్త అణు రియాక్టర్లను అందుబాటులోకి తీసుకువస్తామని, ఫాస్ట్ బ్రీడర్ న్యూక్లియర్ టెక్నాలజీలో భారత్ సాధించిన పురోగతి అణు ఇంధన స్వయంసమృద్ధికి బాటలు వేస్తుందని అన్నారు.

### పౌర రక్షణ, ఇతర లక్ష్యాలు

ఆధునిక విపత్తులు, అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు పౌర రక్షణ (సివిల్ డిఫెన్స్) వ్యవస్థను బలోపేతం చేస్తామని ప్రధాని తెలిపారు. ఇందుకోసం ఆధునిక శిక్షణతో కూడిన పటిష్ఠమైన వాలంటీర్ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. వీటన్నింటితో పాటు, 2047 నాటికి ఫార్చ్యూన్ 500 కంపెనీల జాబితాలో 50 భారత కంపెనీలు, ప్రపంచ టాప్-5 బ్యాంకుల్లో ఒక భారత బ్యాంకు ఉండాలనే బృహత్ లక్ష్యాలను కూడా మోదీ నిర్దేశించారు.

## 22ఏ పేరుతో భారీ దోపిడీ జరుగుతోంది: బండి సంజయ్

హైదరాబాద్: తెలంగాణలో నిషేధిత భూముల జాబితా (22ఏ) ముసుగులో భారీ దోపిడీ సాగుతోందని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్, బీఆర్ఎస్ పాలనల మధ్య ఎలాంటి తేడా లేదని మండిపడ్డారు. రాష్ట్రంలో ఉన్న 2.77 కోట్ల ఎకరాల్లో ఏకంగా 95 లక్షల ఎకరాలను 22ఏ నిషేధిత జాబితాలో ఎలా చేరుస్తారని బండి సంజయ్ నిలదీశారు. ప్రజలు కష్టపడి కొనుక్కున్న స్థలాలు, పరిశ్రమలకు కేటాయించిన భూములు, ప్రభుత్వమే వేలం వేసిన భూములను కూడా ఈ జాబితాలో చేర్చి వేధిస్తున్నారని విమర్శించారు. విద్యాసంస్థల ఫీజు రీయింబర్స్‌మెంట్ పాత బకాయిలను ఇంకా చెల్లించకుండా, వచ్చే విద్యా సంవత్సరం నుంచి అడ్వాన్స్ ఇస్తామనడం విడ్డూరంగా ఉందన్నారు. జెన్-జీ యువతకు స్థానం కల్పిస్తామనే కాంగ్రెస్ మాటలు నిజమైతే... వెంటనే యువకులకు మంత్రి పదవులు, ఎమ్మెల్సీ సీట్లు కేటాయించాలని సవాల్ విసిరారు.

## జెన్-జీ శక్తితోనే మార్పు.. అవినీతి, కులాలపై పోరాటమే నిజమైన స్వేచ్ఛ

తమిళనాడు: తమిళనాడు నూతన ముఖ్యమంత్రి విజయ్ తన తొలి స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో రాజకీయ ప్రత్యర్థులకు బలమైన హెచ్చరికలు జారీ చేయడంతో పాటు యువత, సామాజిక మార్పుపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. చెన్నైలోని చారిత్రాత్మక ఫోర్ట్ సెయింట్ జార్జ్‌లో జాతీయ జెండాను ఆవిష్కరించిన అనంతరం ప్రసంగించిన ఆయన, రాష్ట్రంలో అవినీతిని అంతమొందించడం కూడా ఒక రెండో స్వాతంత్ర్య పోరాటం లాంటిదేనని స్పష్టం చేశారు. రాష్ట్రాభివృద్ధిలో జెన్-జీ, యువతదే కీలక పాత్ర అని పేర్కొన్న విజయ్... కులం, మతం పేరుతో ప్రజలను విభజించే సంకెళ్లను తెంచినప్పుడే దేశంలో నిజమైన స్వేచ్ఛ సాధ్యమవుతుందని అన్నారు. తమిళనాడు హక్కులు, భాషా విధానం, ఆర్థిక వాటా విషయంలో తమ ప్రభుత్వం ఏమాత్రం రాజీపడదని... కేంద్ర ప్రభుత్వంతో పరిపాలనాపరమైన సహకారం ఉన్నప్పటికీ, రాష్ట్ర ప్రయోజనాలకు విఘాతం కలిగించే ఏ చర్యలనైనా తీవ్రంగా నిరోధిస్తామని హెచ్చరించారు. ఇదే వేదికపై స్వాతంత్ర్య సమరయోధుల సంక్షేమం కోసం పలు కీలక ప్రకటనలు చేశారు. స్వాతంత్ర్య సమరయోధులకు ఇచ్చే పింఛనును రూ. 23 వేలకు పెంచుతున్నట్టు ప్రకటించారు. అలాగే వీరపాండ్య కట్టబొమ్మన్, వి.ఓ. చిదంబరం పిళ్లై వంటి వీరుల వారసులకు ప్రత్యేక నిధులను ప్రకటిస్తూ, రాబోయే రోజుల్లో సుపరిపాలనతో తమిళనాడును సరికొత్త శిఖరాలకు తీసుకెళ్తామని తెలిపారు.

## వికసిత్ భారత్ సంకల్పంలో ఏపీ తన పాత్ర పోషిస్తుంది: డిప్యూటీ సీఎం పవన్

అమరావతి: బలమైన, సమర్థవంతమైన దేశంగా ప్రపంచానికి నాయకత్వం వహించే దిశగా భారత్ అడుగులు వేస్తోందని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం కాకినాడలోని పోలీస్ పరేడ్ మైదానంలో నిర్వహించిన వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. ఒక తరం స్వాతంత్ర్యం కోసం పోరాడితే, మరో తరం దానిని కాపాడిందని గుర్తుచేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిర్దేశించిన 'వికసిత్ భారత్' సంకల్పంలో ఏపీ కూడా తనదైన కీలక పాత్ర పోషిస్తుందని ఆయన స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడిపిస్తామని భరోసా ఇచ్చారు. అంతకుముందు పవన్ కల్యాణ్ పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉన్నతాధికారులు, ప్రభుత్వ ఉద్యోగులు, విద్యార్థులు, నగర ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నక్సలిజం అంతమైంది.. కానీ 'దిమాగీ నక్సల్స్' ఇంకా ఉన్నారు: మోదీ



ఢిల్లీ: దేశంలో సాయుధ నక్సలిజం, మావోయిస్టు హింసను దాదాపుగా అంతం చేశామని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. అయితే మావోయిస్టు భావజాలం మాత్రం ఇంకా కొనసాగుతోందని హెచ్చరించారు. ఆ ఆలోచనా విధానంతో ఉన్న వారిని 'దిమాగీ నక్సల్స్'గా పేర్కొన్నారు. ఇలాంటి వ్యక్తులు అవకాశాల కోసం ఎదురుచూస్తున్నారని, సమాజంలో హింస, అశాంతిని ప్రేరేపించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోట నుంచి దేశ ప్రజలను ఉద్దేశించి చేసిన ప్రసంగంలో మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. అడవుల్లో సాయుధ నక్సల్స్‌ను నిర్మూలించడంలో ప్రభుత్వం విజయం సాధించిందని ప్రధాని చెప్పారు. దశాబ్దాలుగా దేశాన్ని వేధించిన ఈ సమస్య నుంచి ప్రజలకు విముక్తి కల్పించామని అన్నారు. అయితే సాయుధ నక్సల్స్ అంతమైనా వారి భావజాలం పూర్తిగా అంతం కాలేదని పేర్కొన్నారు. మావోయిస్టు ఆలోచనా విధానం ఉన్న కొందరు సంస్థలు, వ్యవస్థల్లోకి చొరబడి ప్రభావం చూపేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. అలాంటి వారిని గుర్తించి అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. 2014లో తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రోజే దేశాన్ని నక్సలిజం నుంచి విముక్తి చేయాలని నిర్ణయించుకున్నామని మోదీ తెలిపారు. దాదాపు నాలుగు దశాబ్దాల పాటు నక్సలిజం దేశంలోని అనేక ప్రాంతాలను తీవ్రంగా ప్రభావితం చేసిందన్నారు. యువత, కుటుంబాలు, భద్రతా బలగాలు ఈ హింసతో తీవ్రంగా నష్టపోయాయని చెప్పారు. తుపాకీ భయంతో ప్రజలను బందీలుగా మార్చిన పరిస్థితులు ఉండేవని, రాజ్యాంగ వ్యవస్థను బలహీనపరిచేందుకు మావోయిస్టులు ప్రయత్నించారని ఆరోపించారు. ప్రస్తుతం నక్సలిజం చివరి దశలో ఉందని, పూర్తిగా నిర్మూలించే దిశగా వేగంగా ముందుకు సాగుతున్నామని అన్నారు. సాయుధ నక్సలిజంపై పోరాటంతోనే తమ పని పూర్తికాదని మోదీ స్పష్టం చేశారు. మావోయిస్టు భావజాలాన్ని వ్యాప్తి చేసే వ్యక్తులు హింస, అరాచకాన్ని ప్రోత్సహించేందుకు వివిధ మార్గాలను ఉపయోగిస్తున్నారని ఆరోపించారు. సమాజాన్ని తప్పుదారి పట్టించేందుకు ప్రయత్నించే ఇలాంటి వారిని గుర్తించి ఒంటరి చేయాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య దినోత్సవానికి ముందు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము కూడా నక్సలిజం నిర్మూలనను ప్రశంసించారు. దశాబ్దాలుగా దేశానికి తీవ్ర సవాలుగా ఉన్న నక్సలిజాన్ని అంతం చేయడం గొప్ప విజయమని అన్నారు. గతంలో నక్సలిజం ప్రభావిత ప్రాంతాల్లో ఇప్పుడు అభివృద్ధి కార్యక్రమాలు ఊపందుకున్నాయని పేర్కొన్నారు. బస్తర్ ఒలింపిక్స్, బస్తర్ పండుగ వంటి కార్యక్రమాల్లో స్థానిక ప్రజల భాగస్వామ్యం పెరగడం మార్పునకు నిదర్శనమని తెలిపారు.

# ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన

## - ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి



వికారాబాద్ జిల్లా పరిగి (మహి న్యూస్): స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని పరిగి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పరిగి ఎమ్మెల్యే, టీపీసీసీ ట్రైనింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ప్రజా ప్రతినిధులు, అధికారులు, స్థానిక నాయకులతో కలిసి స్వాతంత్ర్య సమరయోధులకు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. స్వాతంత్ర సమరయోధుల త్యాగాలను స్మరించుకున్నారు.దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుల



ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకొని దేశాభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని తెలిపారు. దేశ సమగ్రత, ఐక్యత, అభివృద్ధి కోసం ప్రతి పౌరుడు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ రజిత వెంకటేష్, డిఎస్పి శ్రీనివాస్, ఎమ్మార్వో వెంకటేశ్వరి, పిఎసిఎస్ చైర్మన్ సిద్ధాంతి పార్థసారథి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సయ్యద్ అయ్యూబ్, పిఎసిఎస్ వైస్ చైర్మన్ రాజ పుల్లారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ హనుమంతు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు జి వెంకట్ రాములు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు గుండెల రామకృష్ణారెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి (నస్కల్ ) దండు అశోక్, బాదం అఖిల శ్రీనివాస్ గుప్తా, గనిమోని శ్రీనివాస్, తౌరియా నాయక్, రాధాకృష్ణారెడ్డి, జగన్, రవికాంత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# డిజిటల్ స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేసిన

## - పరిగి ఎమ్మెల్యే టి రామ్మోహన్ రెడ్డి



వికారాబాద్ జిల్లా పరిగి (మహి న్యూస్):: వికారాబాద్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన డిజిటల్ స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



కార్యక్రమంలో పరిగి ఎమ్మెల్యే,టీపీసీసీ ట్రైనింగ్ కమిటీ చైర్మన్ (ఎస్ ఐ ఆర్) డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ , తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి , జిల్లా కలెక్టర్ తో కలిసి లబ్ధిదారులకు డిజిటల్ స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు.కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు,లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# కల్తీ, కుళ్లిపోయిన బెల్లంపై టాస్క్‌ఫోర్స్ దాడి

## - 7,500 కిలోల బెల్లం స్వాధీనం



వికారాబాద్ జిల్లా పరిగి (మహి న్యూస్): వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఆదేశాల మేరకు జిల్లాలో నిబంధనల ఉల్లంఘనలపై టాస్క్‌ఫోర్స్ ప్రత్యేక నిఘా కొనసాగిస్తోంది. ఇందులో భాగంగా టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ అన్వార్ పాషా ఆధ్వర్యంలో బంట్వారం మండలం బోపనారం గ్రామ పరిధిలో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఆటోలో తాండూర్ కు తరలిస్తున్న సుమారు 4 క్వింటాళ్ల కల్తీ, కుళ్లిపోయిన బెల్లాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆటోలో ఉన్న చంద్ పాషా, డ్రైవర్ మొహమ్మద్ కుతుబొద్దీన్లను విచారించగా, వారి దుకాణంలో కూడా కల్తీ, కుళ్లిపోయిన బెల్లం నిల్వ ఉన్నట్లు గుర్తించారు. దీంతో ఆటోలోని బెల్లంతో పాటు దుకాణంలో ఉన్న నిల్వను కలిపి మొత్తం 7,500 కిలోల కల్తీ, కుళ్లిపోయిన బెల్లాన్ని స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న బెల్లాన్ని తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం బంట్వారం పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ అన్వార్ పాషా మాట్లాడుతూ, కల్తీ, కుళ్లిపోయిన బెల్లం నిల్వపై నిఘా కొనసాగుతుందని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలు ఇలాంటి విషయాలపై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని, సమాచారాన్ని గోప్యంగా ఉంచుతామని కోరారు.

# కర్తవ్యనిష్ఠతో ప్రజల భద్రతకు పోలీస్ శాఖ అంకితం

## - జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా,



వికారాబాద్ జిల్లా పరిగి (మహి న్యూస్): వికారాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయం లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, జాతీయ జెండాను ఎగురవేసి, పోలీస్ సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వికారాబాద్ జిల్లా ప్రజలకు, పోలీస్ అధికారులు మరియు సిబ్బందికి హృదయపూర్వక స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. దేశ స్వాతంత్ర్యం కోసం అపారమైన త్యాగాలు చేసి, తమ ప్రాణాలను సైతం అర్పించిన స్వాతంత్ర్య సమరయోధులకు ఆమె ఘన నివాళులు అర్పించారు. సమావేశాన్ని ఉద్దేశించి ఎస్పీ మాట్లాడుతూ, "ఈ రోజు మనం అనుభవిస్తున్న స్వేచ్ఛ ఎందరో మహనీయుల త్యాగాల ఫలితం. వారి త్యాగాల స్ఫూర్తితో ప్రతి పోలీస్ అధికారి, సిబ్బంది ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ కోసం అంకితభావంతో విధులు నిర్వర్తించాలి" అని అన్నారు. వికారాబాద్ జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. ముఖ్యంగా మహిళలు, చిన్నారుల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, డ్రగ్స్ నియంత్రణ, సైబర్ నేరాల కట్టడి, రోడ్డు భద్రత మెరుగుదలతో పాటు ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించేందుకు



ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. ప్రజలకు పోలీస్ సేవలను మరింత వేగంగా, పారదర్శకంగా అందించేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నామని ఎస్పీ తెలిపారు. పోలీస్ అధికారులు, సిబ్బంది ప్రజలతో స్నేహపూర్వక సంబంధాలు కొనసాగిస్తూ, వారి సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చిత్తశుద్ధితో కృషి చేయాలని ఆదేశించారు. ప్రతి పోలీస్ అధికారి, సిబ్బంది క్రమశిక్షణ, నిజాయితీ, జవాబుదారీతనం అంకితభావంతో విధులు నిర్వర్తిస్తూ వికారాబాద్ జిల్లా పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఆమె పిలుపునిచ్చారు. అనంతరం జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, విధుల నిర్వహణలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన పోలీస్ అధికారులు సిబ్బందికి తెలంగాణ రాష్ట్ర పోలీస్ సేవా పతకాలను ప్రదానం చేసి, వారి విజయాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు వికారాబాద్ డీఎస్పీ అంజయ్య, వీరేష్, ఇన్‌స్పెక్టర్ నాగార్జున, నాగరాజు, ఎస్ఐలు, మినిస్టీరియల్ సిబ్బంది, పోలీస్ అధికారులు పెద్ద సంఖ్యలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# పిఎసిఎస్ కార్యాలయంలో ఘనంగా స్వాతంత్ర దినోత్సవ వేడుకలు

**-పరిగి ఎమ్మెల్యే టి రామ్మోహన్ రెడ్డి పరిగి పిఎసిఎస్ చైర్మన్ సిద్ధాంతి పార్థసారథి, పరిగి పిఎసిఎస్ వైస్ చైర్మన్ బద్రి గారి రాజ్ పుల్లారెడ్డి మున్సిపల్ చైర్ పర్సన్ కుడుముల రజిత వెంకటేష్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సయ్యద్ అయూబ్ లతో కలిసి జాతీయ జెండా ఆవిష్కరించారు**



వికారాబాద్ జిల్లా పరిగి (మహి న్యూస్): పరిగి పిఎసిఎస్ కార్యాలయావరణంలో స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా జాతీయ జెండాను పిఎసిఎస్ చైర్మన్ సిద్ధాంతి పార్థసారథి ఆవిష్కరించారు. పరిగి ఎమ్మెల్యే టి రామ్మోహన్ రెడ్డి పిఎసిఎస్ చైర్మన్ సిద్ధాంతి



పార్థసారథి, బిఎసిఎస్ వైస్ చైర్మన్ బద్రి గారి రాజ్ పుల్లారెడ్డి లతో కలిసి పిఎసిఎస్ సమావేశం హాలును ప్రారంభించారు. 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా ఎమ్మెల్యే టి రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను రైతుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను రైతులకు జరుగుతున్న లాభాలను ప్రతి గడపగడపకు అర్థమయ్యే విధంగా వివరించాలన్నారు.

### పిఎసిఎస్ మీటింగ్ హాల్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి

పట్టణంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో నిర్వహించిన 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో పరిగి ఎమ్మెల్యే, టీపీసీసీ ట్రైనింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి పాల్గొన్నారు. పిఎసిఎస్ చైర్మన్ సిద్ధాంతి పార్థసారథి, వైస్ చైర్మన్ బద్రి గారి రాజపుల్లారెడ్డి, అధికారులు, స్థానిక నాయకులతో కలిసి జాతీయ పతాకానికి వందనం చేసి స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకున్నారు. అనంతరం నూతనంగా నిర్మించిన పిఎసిఎస్ మీటింగ్ హాల్ భవనాన్ని ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. రైతులకు మరింత మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. రైతుల అభ్యున్నతి ప్రభుత్వ లక్ష్యం అని అన్నారు.

### పిఎసిఎస్ కార్యాలయ ఆవరణలో జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న వారికి ఇడ్లీ వడ టిఫిన్ .........

పరిగి పిఎసిఎస్ కార్యాలయావరణంలో జరిగిన స్వాతంత్ర దినోత్సవ వేడుకలలో సందర్భంగా జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి హాజరైన ప్రతి ఒక్కరికి ఇడ్లీ వడ టిఫిన్ కార్యక్రమం నిర్వహించారు. వచ్చినవారికి టిఫిన్ ఇవ్వడంతో పాల్గొన్న నాయకులు కార్యకర్తలు సంబంధిత శాఖల అధికారులు టిఫిన్ చేశారు పిఎసిఎస్ శాఖ వారికి టిఫిన్ అందించినందుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు గతంలో ఎప్పుడు కూడా ఏ ప్రభుత్వ కార్యాలయం దగ్గర ఈ విధంగా ఇవ్వలేదని ఈసారి ఇక్కడ టిఫిన్లు అందజేయడం చాలా సంతోషకరమని పాల్గొన్న ప్రతి ఒక్కరు పిఎసిఎస్ పాలకవర్గాన్ని అభినందించి వెళ్లిపోయారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ రజిత వెంకటేష్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సయ్యద్ అయ్యూబ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ శశికళ ఆనంద్, పిఎసిఎస్ డైరెక్టర్లు చిన్న నరసింహులు, నాగవర్ధన్, జనార్ధన్, రమేష్ చందర్ రెడ్డి, రహీం పటేల్, శశిధర్ రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, మల్లేష్, హరిచందర్, జేలమ్మ, వెంకటయ్య, కాంగ్రెస్ నాయకులు రాధాకృష్ణారెడ్డి, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ సేవలు అందించిన 23 మంది పోలీస్ లకు ప్రశంసా పత్రాలు:-స్పీకర్, ఎమ్మెల్యే ,ఎస్పీ ,చేతుల మీదుగా!



వికారాబాద్ జిల్లా పరిగి (మహి న్యూస్): వికారాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో జిల్లా పోలీస్ శాఖలో విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన ఐటీ సెల్ ఎస్.ఐ . శంకర్, ఎస్.ఐ ఆనంద్ కుమార్,పరిగి ఎస్.ఐ బి. మోహన కృష్ణ పోలీస్ అధికారులు 20 సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేశారు. శాంతిభద్రతల పరిరక్షణ, వీవీఐపీ బందోబస్తు, నేరాల దర్యాప్తు, నేర



నియంత్రణ, కార్యాలయ విధులు తదితర అంశాల్లో ఉత్తమ పనితీరు కనబరిచినందుకు వారిని ఎంపిక చేయడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ప్రశంసా పత్రాలు అందుకున్న అధికారులు, సిబ్బందిని అభినందించారు. అనంతరం కలెక్టరేట్‌లో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన షీ టీమ్స్, భరోసా, సెల్, ఆర్ఫ్మ, ఫింగర్‌ప్రింట్స్ తదితర స్టాల్స్‌ను సందర్శించారు. ఆయా విభాగాల విధులు, ప్రజలకు అందిస్తున్న సేవలు, సాంకేతిక పరిజ్ఞాన వినియోగం గురించి జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, గౌరవ అతిథులకు వివరించారు. మహిళలు, బాలల భద్రత, సైబర్ నేరాల నియంత్రణ, నేర దర్యాప్తులో సాంకేతిక పరిజ్ఞానం వినియోగం తదితర అంశాల్లో పోలీస్ శాఖ చేపడుతున్న చర్యలను గౌరవ అతిథులు పరిశీలించారు.

# పట్టణ అభివృద్ధిలో పారిశుద్ధ్య కార్మికుల పాత్ర గొప్పది

## - మున్సిపల్ చైర్ పర్సన్ కుడుముల రజిత వెంకటేష్





వికారాబాద్ జిల్లా పరిగి (మహి న్యూస్): పట్టణాన్ని ఎప్పటికప్పుడు స్వచ్ఛంగా ఉంచి సుందరంగా తీర్చిదిద్దుతూ పట్టణ అభివృద్ధికి పారిశుద్ధ్య కార్మికుల పాత్ర ఎంతో గొప్పదని పరిగి మునిసిపల్ చైర్ పర్సన్ రజిత వెంకటేష్ అన్నారు స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులకు సబ్బులు నూనెలు టవల్స్ వంటి నిత్యవసర వస్తువులను ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డిలితో కలిసి అందించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పారిశుద్ధ కార్మికులు సూర్యుడి కంటే ముందే లేచి వీధులను శుభ్రపరుస్తూ చేస్తున్న సేవ కొనియాడదగినదని ప్రజలందరూ వారి పట్ల ప్రేమాభిమానాలతో మెలగాలని సూచించారు పారిశుద్ధ కార్మికుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని పనివేళలా విషయంలోనూ జీతభత్యాల విషయంలోనూ ఏదైనా సమస్య ఎదురైతే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు కార్మికుల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ తోడ్పాటు అందిస్తానని తెలిపారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు లాల్ కృష్ణ ప్రసాద్, వైస్ చైర్మన్ కమల్, కౌన్సిలర్లు ఎజాస్,యూసుఫ్, ఆరిఫ్ పటేల్,బాదం అఖిల శ్రీనివాస్, బాలరాజ్ అభి ఉన్నిస అయూబ్, కోఆప్షన్ నెంబర్లు అక్బర్ హుస్సేన్, ఆంజనేయులు ,ఆనంద్ ఫిరంగి వెంకట్రామి రెడ్డి,మున్సిపల్ అధికారులు పారిశుద్ధ్య కార్మికులు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందించండి కే పరిగిలో చత్రాజీ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ఏర్పాటు

## - ఎండి ,డాక్టర్, రాజేందర్.

**ఇక హైదరాబాద్ వెళ్లవలసిన అవసరం లేదు అత్యవసర చికిత్సలకు మన పరిగిలోనే చత్రాజీ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో మెరుగైన చికిత్సలు**



వికారాబాద్ జిల్లా పరిగి (మహి న్యూస్): గ్రామీణ ప్రాంత ప్రజలకు తక్కువ డబ్బుల ఖర్చుకే కార్పొరేట్ వైద్యం అందించాలని పరిగిలో చత్రాజీ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఏర్పాటు చేయడం జరిగిందని మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ఎండి డాక్టర్ రాజేందర్ తెలిపారు. తాను ఒక మధ్యతరగతి కుటుంబానికి చెందిన వ్యక్తిని గ్రామీణ ప్రాంతంలోని ప్రజలు వారికి మేజర్ వ్యాధులు రావడం వలన హైదరాబాద్ వెళ్లి హైదరాబాదులో కార్పొరేట్ ఆసుపత్రుల ఫీజులకు తట్టుకోలేక వైద్యం చేయించుకోలేక మృత్యువాత పడుతున్నారు కావున అది గమనించి గ్రామీణ ప్రాంత ప్రజలకు తక్కువ ధరలకే మెరుగైన వైద్యం అందించాలన్న ఉద్దేశంతోనే పరిగిలో మా నాన్న చిత్రాజి, ఆయన పేరు మీదనే చిత్రాజీ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్వహించడం జరిగిందని పేర్కొన్నారు సంవత్సర కాలంలో దాదాపు ఇప్పటివరకు వేయి వరకు సర్జరీలు చేయడం జరిగిందని ఒక బ్రెయిన్ సర్జరీ సైతం చేయడం జరిగిందని హైదరాబాదులో అందించే వైద్యం పరిగిలోనే అందించడం జరుగుతుందని ఆస్పత్రి ఎండి డాక్టర్ రాజేందర్ తెలిపారు. హైదరాబాదులో నిర్వహించే ప్రతి చికిత్స చత్రాజీ హాస్పిటల్ లో నిర్వహించేందుకు అందుకు సంబంధించిన సౌకర్యాలు పూర్తిస్థాయిలో ఉన్నాయని రోగికి ఎటువంటి పరిస్థితిలోనైనా శత్రాజీ ఆసుపత్రిలో పూర్తిస్థాయిలో వైద్యం అందించడం జరుగుతుంది అవసరమైతే చికిత్స చేయడం జరుగుతుందని ఆసుపత్రి ఎండి డాక్టర్ రాజేందర్ పేర్కొన్నారు.




# ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే స్వాతంత్ర్య స్ఫూర్తికి నిజమైన ప్రతిరూపం



నంద్యాల, మహి న్యూస్, ఆగస్టు 15:- స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం నంద్యాల కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం అధికారులు, ఉద్యోగులు, సిబ్బందికి స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ బ్రిటిష్ పాలన నుంచి భారతదేశానికి అధికార బదలాయింపు జరిగి, దేశం స్వాతంత్ర్యం పొందిన చారిత్రక దినం ఆగస్టు 15 అని పేర్కొన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు, వారు దేశ స్వేచ్ఛ కోసం చేసిన పోరాటాలను స్మరించుకుంటూ ప్రతి సంవత్సరం స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకుంటున్నామని తెలిపారు. స్వాతంత్ర్యం సాధించేందుకు ఎందరో మహనీయులు చేసిన త్యాగాల ఫలితంగానే నేడు మనం స్వేచ్ఛా వాతావరణంలో జీవిస్తున్నామని అన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి నేటి వరకు ప్రజలు తమ అవసరాలు, సమస్యల పరిష్కారం, సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల కోసం ప్రభుత్వంపై, ప్రభుత్వ ఉద్యోగులపై గణనీయంగా ఆధారపడుతున్నారని జాయింట్ కలెక్టర్ తెలిపారు. ప్రజలకు ప్రభుత్వ సేవలను సమర్థవంతంగా, పారదర్శకంగా, సకాలంలో అందించాల్సిన బాధ్యత ప్రభుత్వ ఉద్యోగులపై ఉందన్నారు. దేశం, రాష్ట్రం అభివృద్ధిలో ప్రభుత్వ ఉద్యోగులు తమ వంతు బాధ్యతను మరింత సమర్థవంతంగా నిర్వర్తించాలని సూచించారు. స్వాతంత్ర్య దినోత్సవం కేవలం వేడుకలకు మాత్రమే పరిమితం కాకుండా, మన బాధ్యతలను మననం చేసుకునే సందర్భంగా భావించాలని ఆయన అన్నారు. ప్రభుత్వ వ్యవస్థలో, సమాజంలో ఉన్న లోపాలను నిరంతరం అధిగమిస్తూ ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలని సూచించారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది ప్రజలకు మరింత మెరుగైన, వేగవంతమైన, నాణ్యమైన సేవలు అందించగలగడమే స్వాతంత్ర్య స్ఫూర్తికి నిజమైన అర్థమని జాయింట్ కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజా సంక్షేమం, సుపరిపాలన, పారదర్శకత, జవాబుదారీతనాన్ని మరింత బలోపేతం చేస్తూ జిల్లా అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది మరింత అంకితభావంతో పనిచేసి ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని ఆకాంక్షించారు.



# నేర పరిశోధనలో సత్తా చాటుతున్న కర్నూలు బృందం

**క్రమశిక్షణ.. అంకితభావం.. సమర్థవంతమైన దర్యాప్తే లక్ష్యం**

**నేర పరిశోధన ప్రాంతీయ కార్యాలయంలో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు**



కర్నూలు, ఆగస్టు 15: (మహి న్యూస్) : దేశభక్తి, క్రమశిక్షణ, అంకితభావానికి ప్రతీకగా కర్నూలులోని నేర పరిశోధన ప్రాంతీయ కార్యాలయంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యాలయ ఆవరణలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి గౌరవ వందనం నిర్వహించారు. ఈ సందర్భంగా దేశ స్వాతంత్ర్యం కోసం తమ ప్రాణాలను త్యాగం చేసిన స్వాతంత్ర్య సమరయోధుల సేవలను, త్యాగాలను అధికారులు, సిబ్బంది స్మరించుకున్నారు. స్వాతంత్ర్య సమరయోధుల స్ఫూర్తితో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందిస్తూ, నేరాల నియంత్రణలో అంకితభావంతో పనిచేయాలని అధికారులు పిలుపునిచ్చారు.

### నేర పరిశోధనలో సాంకేతికతకు పెద్దపీట

ప్రస్తుత పరిస్థితుల్లో నేరాల స్వభావం మారుతున్న నేపథ్యంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకుంటూ కేసుల దర్యాప్తును వేగవంతంగా, శాస్త్రీయంగా చేపట్టాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. నేర పరిశోధనలో నాణ్యత, పారదర్శకత, సమర్థతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నేర పరిశోధన ప్రాంతీయ కార్యాలయ డీఎస్పీ రవి కుమార్, సీఐలు పార్థసారథి రెడ్డి, ఎన్.ఎస్.ఎం. శ్రీధర్, ప్రీతమ్ రెడ్డి, దస్తగిరి, గిరిబాబు, అశోక్, శ్రీమతి లలిత, సీఐడీ ఎస్సైలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని అధికారులు, సిబ్బంది పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. దేశ సేవలో పోలీసుల పాత్ర ఎంతో కీలకమని, ప్రజల భద్రత కోసం నిరంతరం అంకితభావంతో పనిచేయడమే స్వాతంత్ర్య సమరయోధులకు అందించే నిజమైన నివాళి అని ఈ సందర్భంగా అధికారులు పేర్కొన్నారు.

# కడపలో ఘనంగా 'అట్ హోమ్' కార్యక్రమం

**స్వాతంత్ర్య స్ఫూర్తితో జిల్లా అభివృద్ధికి సమష్టిగా కృషి చేద్దాం: జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి**

కడప, మహి న్యూస్ ఆగస్టు 15: 80వ భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని కడపలోని జిల్లా కలెక్టర్ బంగ్లా ప్రాంగణంలో శనివారం సాయంత్రం 'అట్ హోమ్' కార్యక్రమం ఆహ్లాదకర వాతావరణంలో కన్నుల పండువగా జరిగింది. జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ తేనీటి విందుకు ప్రభుత్వ విప్, జమ్మలమడుగు ఎమ్మెల్యే చడిపిరాళ్ల ఆదినారాయణ రెడ్డి, జిల్లా ప్రధాన న్యాయమూర్తి యామినీ, జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, జిల్లా జాయింట్ కలెక్టర్ నిధి మీనా, సబ్ కలెక్టర్ హెచ్.ఎస్. భావన, డీఆర్వో మల్లికార్జునుడు, కడప నగర పాలక సంస్థ కమిషనర్ భవానీ ప్రసాద్, అదనపు కమిషనర్ రాకేష్ చంద్రం, కడప, జమ్మలమడుగు, బద్వేలు, పులివెందుల ఆర్డీఓలు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్ర్య స్ఫూర్తితో దేశ సమైక్యత, సమగ్రత కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. విధులు, బాధ్యతలను నిబద్ధతతో నిర్వహిస్తూ జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. జాయింట్ కలెక్టర్, సబ్ కలెక్టర్, ఆర్డీఓలు, అన్ని శాఖల అధికారుల సమన్వయంతో జిల్లాను మరింత అభివృద్ధి స్థాయికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధిలో వైఎస్ఆర్ జిల్లాకు ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలని అధికారులను కోరారు. అనంతరం జిల్లా కలెక్టర్, ఎస్పీ, జాయింట్ కలెక్టర్ తదితరులు ప్రతి టేబుల్ వద్దకు వెళ్లి అధికారులు, వారి కుటుంబ సభ్యులను పలకరించి పరిచయం చేసుకున్నారు.

### ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

జిల్లా సాంస్కృతిక, పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కడప ముద్ర అకాడమీ, ప్రొద్దుటూరు నృత్య తరంగిణి కళా బృందాల ప్రదర్శనలతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు ప్రదర్శించిన నృత్య, గాన కార్యక్రమాలు అందరినీ అలరించాయి. కార్యక్రమాల్లో పాల్గొన్న కళాకారులను జిల్లా కలెక్టర్ జ్ఞాపికలతో సత్కరించారు. జిల్లా అధికారులు తమ కుటుంబ సభ్యులతో కలిసి సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని ఉల్లాసంగా గడిపారు.

# 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

## వైద్య సేవలతోనే అసలైన దేశభక్తి



శ్రీకాకుళం, మహి న్యూస్, ఆగస్టు 15: స్వాతంత్ర్య విలువలను కాపాడుతూ రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే అసలైన దేశభక్తి అని శ్రీకాకుళం ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జి. సౌమిని అన్నారు. శ్రీకాకుళం ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి ప్రాంగణంలో శనివారం నిర్వహించిన 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు సివిల్ జడ్జి హరిబాబుతో కలిసి సూపరింటెండెంట్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి గౌరవ వందనం స్వీకరించారు. ఆసుపత్రి అభివృద్ధికి, రోగుల సేవకు ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని ఈ సందర్భంగా ఆమె పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భాగంగా ఆసుపత్రి సేవల్లో విశేష కృషి చేసిన వైద్యులు, నర్సులు, పారామెడికల్, పారిశుద్ధ్య, సెక్యూరిటీ విభాగాలకు చెందిన 60 మంది సిబ్బందిని ముఖ్య అతిథి, సూపరింటెండెంట్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలతో ఘనంగా సన్మానించారు. జిల్లా న్యాయ వ్యవస్థ మహోత్సవంలో భాగంగా ఆసుపత్రి ఆవరణలో జడ్జి హరిబాబు తో కలిసి ఆమె మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణతోనే ఆరోగ్యకర సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని జడ్జి హరిబాబు పేర్కొన్నారు. ఈ వేడుకల్లో పలువురు వైద్యులు, విభాగాధిపతులు, సిబ్బంది, రోగుల బంధువులు పాల్గొన్నారు.



## అభివృద్ధి ప్రదర్శనగా ప్రభుత్వ స్టాళ్లు

శ్రీకాకుళం, మహి న్యూస్, ఆగస్టు 15: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు ఏ స్థాయిలో మేలు చేకూరుస్తున్నాయో చాటిచెప్పేలా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రభుత్వ శాఖల స్టాళ్లు నిలిచాయి. శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించిన వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన ప్రదర్శనా స్టాళ్లను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పరిశీలించారు. ఈ సందర్భంగా నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించి ఆర్థికంగా బలోపేతం చేయడమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని పేర్కొంటూ, అర్హులైన లబ్ధిదారులకు సబ్సిడీ యంత్ర పరికరాలను పంపిణీ చేశారు. ఈ ప్రదర్శనలో పశుసంవర్ధక, వ్యవసాయ, మత్స్య, ఉద్యాన, పట్టు పరిశ్రమ, సాంఘిక సంక్షేమ, మహిళా శిశు సంక్షేమ శాఖలతో పాటు ఏపీ ఎంఐపీ, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ, మెప్మా, విద్యాశాఖ, సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో స్టాళ్లు కొలువుదీరాయి. అలాగే నీకో పవర్, ఆర్కే సోలార్, ఆక్వాకల్చర్, యూబీఐ ఆర్సెటీ సంస్థలు తమ నైపుణ్య, సాంకేతిక ప్రదర్శనలు నిర్వహించగా.. ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ గ్యాలరీ, ఉచిత వైద్య శిబిరం, తాగునీటి స్టాళ్లు సందర్శకులకు అందుబాటులో నిలిచాయి. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, అసిస్టెంట్ కలెక్టర్ హరి ఓం పాండియా, ఎమ్మెల్యే గొండు శంకర్, ఆయా శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తితో దేశాభివృద్ధికి కృషి చేయాలి

### వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె.ఆర్. రజని



ఎచ్చెర్ల, మహి న్యూస్, ఆగస్టు 15: స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ నిజాయతీతో దేశాభివృద్ధి కోసం శ్రమించాలని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె.ఆర్. రజని పిలుపునిచ్చారు. ఎచ్చెర్లలోని వర్సిటీ ప్రాంగణంలో శనివారం నిర్వహించిన 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఆమె పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో ప్రతీ ఒక్కరూ జవాబుదారీతనం అలవర్చుకుని ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కోరారు. సమాజ వికాసంలో ఉన్నత విద్యాసంస్థలు క్రియాశీల భాగస్వామ్యం వహించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. విశ్వవిద్యాలయంలో జరిగే పరిశోధనలు, అధ్యయనాలు సామాన్యులకు ఉపయోగపడేలా ఉండాలని ఆకాంక్షించారు. వేడుకల సందర్భంగా విద్యార్థులు, సిబ్బంది త్రివర్ణ పతాకంతో నిర్వహించిన ర్యాలీ ఉత్సాహభరితంగా సాగింది. ఎన్.సి.సి. కేడెట్లు వైస్ ఛాన్సలర్ సగౌరవ వందనం స్వీకరించగా, విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి. అడ్డయ్య, వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్లు డాక్టర్ ఎం. అనురాధ, డాక్టర్ కె. స్వప్నవాహిని, డాక్టర్ సి.హెచ్. రాజశేఖరరావు, సీనియర్ అధ్యాపకురాలు ప్రొఫెసర్ పి. సుజాత, డీన్లు డాక్టర్ లోకేశ్వరి, డాక్టర్ యు. కావ్యజ్యోత్స్న, డాక్టర్ అంకెం భాస్కర్, స్పోర్ట్స్ విభాగ కార్యదర్శి డాక్టర్ ఎం. శ్రీనివాసరావు, ఎన్.ఎస్.ఎస్. కోఆర్డినేటర్ డాక్టర్ డి. వనజ తదితరులు పాల్గొన్నారు.

## అధికార యంత్రాంగం సమష్టి కృషికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రశంసలు



శ్రీకాకుళం, మహి న్యూస్, ఆగస్టు 15: శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పురుషుల కళాశాల మైదానంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను అత్యంత వైభవంగా, క్రమశిక్షణతో నిర్వహించడంలో కీలకపాత్ర పోషించిన అధికార యంత్రాంగాన్ని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అభినందించారు. వివిధ ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేసి వేడుకలను విజయవంతం చేయడంపై మంత్రి హర్షం వ్యక్తం చేశారు.వేడుకల ఏర్పాట్ల నుంచి కార్యక్రమం ముగిసే వరకు అధికారులు, సిబ్బంది అంకితభావంతో విధులు నిర్వర్తించారని మంత్రి ప్రశంసించారు. ప్రతి శాఖ సమన్వయంతో పనిచేస్తూ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించి, ప్రజల భాగస్వామ్యంతో స్వాతంత్ర్య వేడుకలను విజయవంతం చేసిన అధికార, అనధికార వర్గాలకు మంత్రి అభినందనలు తెలిపారు. జిల్లా అభివృద్ధిలోనూ ఇదే స్ఫూర్తి కొనసాగాలిస్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నిర్వహణలో కనబరిచిన సమష్టి స్ఫూర్తి, సమన్వయం, అంకితభావాన్ని జిల్లా అభివృద్ధిలోనూ కొనసాగించాలని మంత్రి ఆకాంక్షించారు. ప్రజలకు మెరుగైన పాలన అందించడంతో పాటు సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి కార్యక్రమాల వేగవంతం దిశగా అధికారులు మరింత సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు.

### కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు ప్రత్యేక ప్రశంసలు

వేడుకల నిర్వహణను ముందుండి పర్యవేక్షిస్తూ అన్ని శాఖలను సమన్వయం చేసిన జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను మంత్రి అచ్చెన్నాయుడు ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమం విజయవంతంగా జరిగేలా సమర్థవంతమైన ఏర్పాట్లు చేసి, అధికార యంత్రాంగాన్ని సమన్వయంతో ముందుకు నడిపిన కలెక్టర్ కృషిని ప్రశంసించారు.జిల్లా యంత్రాంగం ఇదే సమన్వయం, చిత్తశుద్ధి, అంకితభావంతో ముందుకు సాగుతూ శ్రీకాకుళం జిల్లాను అభివృద్ధి పథంలో మరింత ముందుకు తీసుకెళ్లాలని మంత్రి అచ్చెన్నాయుడు ఆకాంక్షించారు

## హరే కృష్ణ మూమెంట్ చారిటబుల్ ఫౌండేషన్‌కు ప్రతిష్టాత్మక స్వాతంత్ర్య దినోత్సవ అవార్డు



శ్రీకాకుళం, మహి న్యూస్, ఆగస్టు 15: 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా శ్రీకాకుళం జిల్లాలో విశేష సేవా కార్యక్రమాలు అందిస్తున్న 'హరే కృష్ణ మూమెంట్ చారిటబుల్ ఫౌండేషన్ ' ప్రతిష్టాత్మక జిల్లా స్థాయి అవార్డును అందుకుంది. శుక్రవారం నిర్వహించిన వేడుకల్లో రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖల మంత్రి అచ్చెన్నాయుడు చేతుల మీదుగా ఫౌండేషన్ ప్రతినిధులు ఈ ప్రశంసా పత్రాన్ని స్వీకరించారు. శ్రీకాకుళం జిల్లాలో ఫౌండేషన్ అధ్యక్షుడు శ్రీమాన్ నిష్కించన భక్తిదాస ప్రభూజీ మార్గదర్శకత్వంలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం, ఎన్టీఆర్ అన్నా క్యాంటీన్లు, పలు ఆస్పత్రుల్లో నిరంతరం అన్నదాన సేవా కార్యక్రమాలను దిగ్విజయంగా నిర్వహిస్తున్నారు. సమాజ సేవే ధ్యేయంగా పనిచేస్తున్న ఫౌండేషన్ సేవలను గుర్తిస్తూ ప్రభుత్వం ఈ పురస్కారాన్ని అందించింది.

## ఎ.పి.యస్.పి 3వ పటాలము,పాఠశాల.

కాకినాడ, మహి న్యూస్, ఆగస్టు 15 : కాకినాడ జిల్లా 3వ పటాలం ఎ.పి.యస్.పి. ఇంగ్లీషు మీడియం స్కూల్ నందు 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకకు ముఖ్య అతిథులుగా కమాండెంట్ కె. నవీన్ కుమార్ మరియు పద్మ హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి గౌరవ వందనం స్వీకరించారు. ఈ వేడుకలలో భాగంగా కమాండెంట్ కె. నవీన్ కుమార్ మాట్లాడుతూ, భారతదేశం 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకుంటున్న ఈ సందర్భంగా దేశ స్వాతంత్ర్య పోరాటాన్ని, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకోవడం ప్రతి భారతీయుడి బాధ్యత అని తెలిపారు. మన దేశం వందల సంవత్సరాల బానిసత్వం నుండి విముక్తి పొందిన చారిత్రక సందర్భానికి గుర్తుగా స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని పేర్కొన్నారు. గత 80 సంవత్సరాలలో భారతదేశం విద్య, వ్యవసాయం, అంతరిక్షం, క్రీడలు, శాస్త్ర సాంకేతిక రంగాలలో ఎంతో గొప్ప పురోగతిని సాధించిందని కమాండెంట్ పేర్కొన్నారు.



ఆత్మనిర్భర్ భారత్ దిశగా దేశం స్వయం సమృద్ధిని సాధిస్తూ ముందుకు సాగుతోందని తెలిపారు. భారతదేశం ఏ80 నుంచి





2047లో 100 సంవత్సరాల స్వాతంత్ర్య వేడుకల వరకు మన ప్రయాణం మరింత అభివృద్ధి చెందిన, శక్తివంతమైన భారతదేశం వైపు సాగాలని ఆకాంక్షించారు. 2047 నాటికి భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దడంలో నేటి విద్యార్థుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. విద్యార్థులు తమ జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని, తమ నైపుణ్యాలను నిరంతరం మెరుగుపరుచు కోవాలని సూచించారు. పెద్దలను గౌరవిస్తూ, సమాజాన్ని, ప్రకృతిని, మన సంస్కృతిని మరియు ప్రతి భాషను, ప్రతి సమాజాన్ని గౌరవించాలని తెలిపారు. భారతదేశ వైవిధ్యాన్ని గౌరవించడం ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. అన్నింటికంటే ముందుగా ప్రతి విద్యార్థి తన దేశాన్ని ప్రేమించాలని, దేశం పట్ల బాధ్యత మరియు గౌరవ భావన కలిగి ఉండాలని కమాండెంట్ సూచించారు. మన స్వాతంత్ర్య సమర యోధులు మనకు స్వేచ్ఛా భారతదేశాన్ని అందించగా, మన దూరదృష్టి గల నాయకులు దేశంలో ఎన్నో గొప్ప మార్పులకు పునాది వేశారని తెలిపారు. నేటి విద్యార్థులే రేపటి భారతదేశ భవిష్యత్తు అని, వారు విద్యావంతులుగా, నైపుణ్యవంతులుగా, బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదిగి దేశ అభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. వికసిత్ భారత్ అనేది కేవలం ప్రభుత్వ లక్ష్యం మాత్రమే కాదని, అది ప్రతి భారతీయుడి సమిష్టి బాధ్యత మరియు కర్తవ్యమని కమాండెంట్ అన్నారు. 2047 నాటికి బలమైన, విద్యావంతమైన, స్వయం సమృద్ధి,సమగ్ర మరియు అభివృద్ధి చెందిన భారత దేశాన్ని నిర్మించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భాగంగా వివిధ పోటీ పరీక్షలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకుబహుమతులు అందజేశారు.విద్యార్థులు ప్రదర్శించిన స్వాతంత్ర్య సమరయోధుల వేష ధారణలు,సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ ఎస్. దేవానందరావు, అసిస్టెంట్ కమాండెంట్స్ జి.ఎస్. చంద్రశేఖరరావు, ఎస్. మన్మథరావు, స్కూల్ ప్రిన్సిపాల్, హెడ్‌మాస్టర్, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, స్కూల్ సిబ్బంది మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు

## ఇంద్రకీలాద్రిపై ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

ఇంద్రకీలాద్రి, మహీ న్యూస్, ఆగస్టు 15 : విజయవాడ ఇంద్రకీలాద్రి శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో శనివారం 80వ భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించబడ్డాయి. ఆలయరాజ గోపురం ప్రాంగణంలో కార్యనిర్వహణాధికారి వి.కె. శీనా నాయక్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆలయ భద్రతా సిబ్బంది నుండి గౌరవ వందనం స్వీకరించి, గత ఏడాది కాలపు వార్షిక ప్రగతి నివేదికను సమర్పించారు.

### దేవస్థానం నివేదిక -- ముఖ్యాంశాలు:

భక్తుల సంతృప్తిలో అగ్రస్థానం: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ఐవీఆర్ఎస్ సర్వేల్లో దేవస్థానం భక్తుల సంతృప్తి స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిందని ఈవో తెలిపారు. గత 10 సంవత్సరాలగా రథం సెంటర్‌లో దేవస్థానం భూమి ఆక్రమణలో ఉండగా, అవి తొలగించి భక్తుల సేవా కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. ?రికార్డు స్థాయి ఉత్సవాలు: దసరా మహోత్సవాల్లో 18 లక్షల మందికి పైగా భక్తులకు విస్తృత వసతులు కల్పించామని, గత దశాబ్ద కాలంలోనే అత్యధికంగా ముగిసిన ఆషాఢ మాసంలో 6 లక్షలకు పైగా భక్తులు సారె సమర్పించారని పేర్కొన్నారు. 250 మందికి పైగా చిన్నారులకు ఉచిత సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించామని తెలిపారు. అభివృద్ధి పనులు ఒ డిజిటల్ సేవలు: నూతన లడ్డూ పోటు భవనం, నూతన అన్నప్రసాద భవనం నిర్మాణ పనులు పూర్తి దశకు చేరాయని, పవిత్ర కృష్ణానది హారతులకు శాశ్వత నిర్మాణాలు చేపడుతున్నామని వివరించారు.

### 'మనమిత్ర' వాట్సాప్ ద్వారా ఆన్‌లైన్ సేవలు, కియోస్కులు అందుబాటులోకి తెచ్చామన్నారు.

### ఆలయ ?చైర్మన్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ) సందేశం:

?కార్యక్రమంలో పాల్గొన్న దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ) మాట్లాడుతూ.. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మరియు దేవాదాయ శాఖ సహకారంతో ఇంద్రకీలాద్రికి వచ్చే ప్రతి సామాన్య భక్తుడికి సంతృప్తికరమైన దర్శనం, నాణ్యమైన సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని పేర్కొన్నారు. రాబోయే దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను మరింత వైభవంగా నిర్వహించేందుకు అందరూ సమన్వయంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు.

### 50 మంది సిబ్బందికి ప్రశంసా పత్రాల బహుకరణ:

?విధుల్లో విశేష ప్రతిభ, అంకితభావం కనబరిచిన దేవస్థానంలోని వివిధ విభాగాలకు చెందిన 50 మంది సిబ్బందికి ఆలయ చైర్మన్ మరియు ఈవో గార్లు ప్రోత్సాహక ప్రశంసా పత్రాలను అందజేశారు. ప్రశంసా పత్రాలు పొందిన వారిలో అర్చకులు, కార్యాలయ సిబ్బంది, ఇంజనీరింగ్, సెక్యూరిటీ, శానిటేషన్ (పారిశుద్ధ్యం), కేశఖండన శాల మరియు వేద పాఠశాల సిబ్బంది ఉన్నారు. ఉన్నతాధికారుల చేతుల మీదుగా అవార్డులు అందుకోవడంతో సిబ్బందిలో హర్షం వ్యక్తమైంది. ఈ కార్యక్రమంలో వాగ్దేవి కూచిపూడి నృత్యాలయ, విజయవాడ విద్యార్థులు నృత్యాచార్య సప్పశివకుమార్ ఆధ్వర్యంలో కళా ప్రదర్శన చేసారు. సంప్రదాయపాఠశాల, గాంధీ నగర్ విద్యార్థులు జాతీయ గీతాలాపన చేశారు. ఈ వేడుకల్లో దేవస్థాన ధర్మకర్తల మండలి సభ్యులు అవ్వారు శ్రీనివాసరావు, టి. హరికృష్ణ, టి. రమాదేవి, ఎస్. సరిత, ఆలయ వైదిక కమిటీ సభ్యులు, ఇంజనీరింగ్ మరియు పరిపాలనా విభాగ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## దేశం అగ్రగామిగా నిలవడమే నిజమైన స్వాతంత్ర్య సిద్ధాంతం



శ్రీకాకుళం, మహి న్యూస్, ఆగస్టు 15: వందేళ్ల స్వాతంత్ర్య వేడుకల నాటికి భారతదేశం ప్రపంచంలోనే అగ్రగామిగా నిలవాలని శ్రీకాకుళం శాసనసభ్యులు గొండు శంకర్ ఆకాంక్షించారు. శ్రీకాకుళం నగరపాలక సంస్థ కార్యాలయ ఆవరణలో మున్సిపల్ కమిషనర్ శ్రవణ్ కుమార్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించిన 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై, జాతీయ జెండాను ఆవిష్కరించారు. జెండా ఆవిష్కరణకు ముందు జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 2047 నాటికి 'వికసిత్ భారత్', 'స్వర్ణాంధ్రప్రదేశ్' సాధించడమే లక్ష్యంగా అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. పట్టణాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, సుమారు 28 కోట్ల రూపాయలతో మౌలిక సదుపాయాలు మెరుగుపరిచామని, విద్యుత్ సమస్యల పరిష్కారానికి ఆర్ట్స్ కాలేజీ వద్ద 132 కేవీ సబ్ స్టేషన్‌తో పాటు తాగునీరు, మురుగునీటి శుద్ధి కేంద్రాల నిర్మాణం చేపడుతున్నట్లు స్పష్టం చేశారు. ఈ వేడుకల్లో భాగంగా నగరపాలక సంస్థ పరిధిలో విశేష ప్రతిభ కనబరిచిన అధికారులు, సిబ్బందితో పాటు పారిశుద్ధ్య కార్మికులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అందజేసి, అభినందించారు. మున్సిపల్ కమిషనర్ శ్రవణ్ కుమార్ పర్యవేక్షణలో సిబ్బంది అందిస్తున్న నిరంతర సేవలను ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు పాండ్రంకి శంకర్, క్లస్టర్ ఇంచార్జి అందవరపు సంతోష్, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు, నగరపాలక సంస్థ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది, నగర ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు.



కాకినాడ, మహి న్యూస్, ఆగస్టు 15 : కాకినాడ సమాచార పౌర సంబంధాల శాఖ ఉప సంచాలకుల(డీఐపీఆర్ఓ) కార్యాలయంలో శనివారం 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఉపసంచాలకులు బి పద్మజ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె కార్యాలయ సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ.. ఎందరో వీరుల త్యాగఫలము నేటి ఈ స్వేచ్ఛ అని పేర్కొన్నారు. స్వాతంత్ర్య సమర యోధుల త్యాగాలను స్మరించుకుంటూ వారి ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ విధులు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్ర మాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడంలో సమాచార శాఖ పాత్ర అత్యంత కీలకమైనదని ఈ సందర్భంగా ఆమె పేర్కొ న్నారు. కార్యక్రమంలో సమాచార పౌర సంబంధాల శాఖ డివిజనల్ పీఆర్ఓ వి.వి. రామిరెడ్డి, పీఆర్ఓ ఎస్.అజయ్, ఏవీఎస్ జి ధర్మరాజు, సీనియర్ అసిస్టెంట్ సురేష్, ఫోటోగ్రాఫర్ సీహెచ్.నరేష్ బాబు, వీడియోగ్రాఫర్ ఐ.నాగార్జున, కార్యాలయ సిబ్బంది కే.భారతి, జె.సతీష్, ప్రసాద్, లక్ష్మి కాంతం, గోపి, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## అబ్బురపరచిన ప్రగతి శకటాలు





గుంటూరు, మహి న్యూస్, ఆగస్టు 15 : రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ వివిధ శాఖలు తయారు చేసిన శకటాలు గుంటూరు పట్టణ వాసులను అబ్బురపరిచాయి. గుంటూరు జిల్లా నేలపాడు (అమరావతి)లో రాష్ట్ర స్థాయి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ వేడుకలలో 25 శాఖలకు చెందిన శకటాలు ప్రదర్శించారు. ప్రదర్శించిన శకటాలను పెరేడ్ గ్రౌండ్స్ కు పరిమితం చేయకుండా ప్రజలు ప్రత్యక్షంగా వీక్షించుటకు గుంటూరు, సి.ఆర్.డి.ఏ ప్రాంతం, విజయవాడలో మూడు రోజుల పాటు ప్రదర్శించాలని నిర్ణయించడం జరిగింది. ఇందులో భాగంగా గుంటూరు పట్టణంలో శనివారం సాయంత్రం ఆర్.టి.జి.ఎస్, వైద్య ఆరోగ్య శాఖ, రెవెన్యూ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖల శకటాలు ప్రదర్శనకు పెరేడ్ గ్రౌండ్స్ లోకి రావడం జరిగింది. శనివారం సాయంత్రం ఆర్.టి.సి బస్ స్టాండ్ మీదుగా గుంటూరు పట్టణ పెరేడ్ గ్రౌండ్స్ కు ప్రదర్శనగా చేరుకున్నాయి. ప్రజలు ఆసక్తిగా తిలకించడమే కాకుండా సెల్ఫీలు దిగారు. ఆర్.టి.జి.ఎస్ శకటాన్ని మరింత ఆసక్తిగా తిలకించారు. మూడు రోజుల పాటు ప్రదర్శించాలని జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ ఆదేశాల మేరకు ఆదివారం ఉదయం 10 గంటల వరకు పెరేడ్ గ్రౌండ్స్ లో ప్రదర్శన కొనసాగించిన అనంతరం స్వామి థియేటర్, రింగ్ రోడ్ తదితర ప్రదేశాల్లో శకటాల ప్రదర్శన ఉంటుంది. గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ కె.మయూర్ అశోక్ ఆదేశాల మేరకు డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్ సమన్వయం చేస్తున్నారు. పోలీసు శాఖ ట్రాఫిక్ రద్దీ, వాహనాలు రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నారు.

## మిట్ట మధ్యాహ్నం వరకు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు.

### ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుల అత్యుత్సాహం.. ఆకలితో అలమటించిన విద్యార్థులు





తాళ్లరేవు మండలం, మహీ న్యూస్, ఆగస్టు 15: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన వేడుకలు విద్యార్థులకు ఇబ్బందికరంగా మారాయి. తాళ్లరేవు మండలం పరిధిలోని ఇంజరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఉదయం ప్రారంభించి మధ్యాహ్నం ఒంటిగంట 45 నిమిషాల వరకు కొనసాగించడంపై విద్యార్థుల తల్లిదండ్రులు, పలువురు విద్యార్థులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా జాతీయ పర్వదినాలను పాఠశాలల్లో ఘనంగా నిర్వహించడం ఆనవాయితీ. జాతీయ జెండా ఆవిష్కరణ, జాతీయ గీతం, సాంస్కృతిక కార్యక్రమాలు, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల స్మరణ, విద్యార్థుల ప్రసంగాలు తదితర కార్యక్రమాలను నిర్వహిస్తారు. అయితే ఇంజరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాత్రం కార్యక్రమాలను పరిమిత సమయానికి ముగించకుండా సుదీర్ఘంగా కొనసాగించడంతో విద్యార్థులు తీవ్ర అసౌకర్యానికి గురైనట్లు తెలుస్తోంది. ఉదయం నుంచి పాఠశాలలోనే ఉన్న విద్యార్థులు మధ్యాహ్న సమయం దాటుతున్నా కార్యక్రమాలు కొనసాగడంతో ఆకలితో అలమటించిన పరిస్థితి ఏర్పడిందని పలువురు పేర్కొన్నారు. చిన్నారులు నీరసంగా కనిపించినప్పటికీ కార్యక్రమాలను కొనసాగించడం పట్ల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్వాతంత్ర్య దినోత్సవం వంటి జాతీయ పర్వదినాలను నిర్వహించడం ఎంత ముఖ్యమో, విద్యార్థుల ఆరోగ్యం, వారి వయస్సు, ఆహార సమయాలను దృష్టిలో ఉంచుకోవడం కూడా అంతే ముఖ్యమని వారు అభిప్రాయపడుతున్నారు. వేడుకల పేరుతో సమయపాలన లేకుండా కార్యక్రమాలను సాగదీయడం వల్ల విద్యార్థులకు దేశభక్తి, జాతీయ స్ఫూర్తి కలిగించాల్సిన కార్యక్రమం అసౌకర్యానికి కారణమైందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా పాఠశాల స్థాయి కార్యక్రమాల్లో విద్యార్థుల వయస్సు, వారి సామర్థ్యం, వాతావరణ పరిస్థితులు, ఆహార సమయాలను పరిగణనలోకి తీసుకుని కార్యక్రమాలను రూపొందించాల్సిన అవసరం ఉందని పలువురు సూచిస్తున్నారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు విద్యార్థుల్లో దేశభక్తి భావనను పెంపొందించేలా, ఆనందదాయకంగా ఉండాల్సిన అవసరం ఉందని తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. భవిష్యత్తులో ఇలాంటి కార్యక్రమాలను సమయపాలనతో నిర్వహించి విద్యార్థులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. ఈ ఘటనపై సంబంధిత విద్యాశాఖ అధికారులు దృష్టి సారించి, పాఠశాలల్లో జాతీయ పర్వదినాల కార్యక్రమాల నిర్వహణకు తగిన సమయపాలన పాటించేలా సూచనలు ఇవ్వాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

## చిత్తూరు పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

చిత్తూరు, మహి న్యూస్, ఆగస్టు 15: 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా చిత్తూరు పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో శుక్రవారం జాతీయ పతాకాన్ని రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మరియు వైద్య విద్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆవిష్కరించారు. అనంతరం పోలీస్ బలగాల గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు పార్లమెంట్ సభ్యులు దగ్గుమళ్ల ప్రసాదరావు, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఎస్పీ తుషార్ డూడి, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, పూతలపట్టు ఎమ్మెల్యే కే. మురళీమోహన్, జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, జిల్లా అధికారులు, పోలీసు అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్ వద్ద రూ.52 లక్షలతో నిర్మించిన నూతన పార్కు ప్రారంభం



చిత్తూరు, మహి న్యూస్, ఆగస్టు 15: చిత్తూరు పట్టణంలోని కలెక్టరేట్ వద్ద రూ.52 లక్షలతో నూతనంగా నిర్మించిన పార్కును రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మరియు వైద్య విద్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు పార్లమెంట్ సభ్యులు దగ్గుమళ్ల ప్రసాదరావు, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్‌లో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

చిత్తూరు, మహి న్యూస్, ఆగస్ట్ 15: కలెక్టరేట్‌లో 80 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శనివారం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, గౌరవ వందనం సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ.. నాటి స్వాతంత్ర్య సమర యోధుల త్యాగఫలమే నేడు మనం అనుభవిస్తున్న స్వాతంత్ర్యమని కొనియాడారు. దేశం కోసం ప్రాణాలర్పించిన మహానుభావుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని పిలుపునిచ్చారు. సమర యోధుల దేశభక్తిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకొని, వారి అడుగుజాడల్లో నడుస్తూ దేశాభివృద్ధికి భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ వెంకటేశ్వర్ జిల్లా రెవెన్యూ అధికారి మోహన్ కుమార్, పలు శాఖల జిల్లా అధికారులు మరియు కలెక్టరేట్ సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు.

## దేశభక్తి ఉట్టిపడేలా అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



చిత్తూరు, మహి న్యూస్, ఆగస్టు 15: 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా చిత్తూరు జిల్లా పోలీసు పెరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వివిధ పాఠశాలలు, ఈ సందర్భంగా పోలీసు పెరేడ్ గ్రౌండ్‌లో పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థులు దేశభక్తి, జానపద, యోగా తదితర అంశాలపై ప్రదర్శనలు ఇచ్చారు. ఏపీ స్పర్స్ గర్ల్స్ , చిత్తూరు విద్యార్థులు "123 123 తల్లి తండ్రి గురు మూర్తులు త్రి" దేశభక్తి థీమ్‌పై, విజయం ఇంజినీరింగ్ కళాశాల, చిత్తూరు విద్యార్థులు "యే దేశ్ హై వీర్ జవానోన్ కా" దేశభక్తి గీతంపై, శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ విద్యార్థులు "బీట్ ఆఫ్ జాతర" థీమ్‌పై,



ఆర్ కే మోడల్ ఇంగ్లీష్ మీడియం స్కూల్, చిత్తూరు విద్యార్థులు "భారత్ మేరా భారత్" థీమ్‌పై, రెయిన్బో ఇంగ్లీష్ మీడియం స్కూల్, చిత్తూరు విద్యార్థులు "విశ్వ వినూతన విద్యా చేతన" థీమ్‌పై ప్రదర్శనలు ఇచ్చారు. అలాగే రాజా రాజేశ్వరి కోలాట బృందం, శాంతిపురం మండలం వారు "రవికుల తిలక మా ఊరి దేవుడు అంధ్రల రాముడు" జానపద ప్రదర్శన, లిటిల్ ఫ్లవర్ ఎయిడెడ్ స్కూల్, చిత్తూరు విద్యార్థులు "ఘయండకర్ భవానికే" థీమ్‌పై, కె జి బి వి, గుడుపల్లె విద్యార్థులు "యోగా విత్ పిరమిడ్" ప్రదర్శన, ప్రభుత్వ జూనియర్ కాలేజ్, పాలసముద్రం విద్యార్థులు "సత్యం పలికే హరిశ్చంద్రులం - మేమే ఇండియన్స్" థీమ్‌పై సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో మొదటి బహుమతి కె జి బి వి, గుడుపల్లె విద్యార్థులు, రెండవ బహుమతి విజయం ఇంజినీరింగ్ కళాశాల, చిత్తూరు విద్యార్థులు, తృతీయ బహుమతి ప్రభుత్వ జూనియర్ కళాశాల, పాలసముద్రం విద్యార్థులు గెలుచుకున్నారు. గెలుపొందిన విద్యార్థులకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా సర్టిఫికెట్లు, మెమెంటోలు అందజేశారు. వీరితో పాటు సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థులందరికీ సర్టిఫికెట్లు అందజేశారు.

## ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రక్తదాన కేంద్రం, జిల్లా శాఖ కార్యాలయం ప్రారంభం



చిత్తూరు, మహి న్యూస్, ఆగస్టు 15: చిత్తూరు పట్టణంలో నూతనంగా నిర్మించిన ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రక్తదాన కేంద్రం మరియు జిల్లా శాఖ కార్యాలయాన్ని రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మరియు వైద్య విద్యాశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ , చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## 80 వ స్వాతంత్ర దినోత్సవ సందర్బంగా చిత్తూరు వన్ టౌన్ కానిస్టేబుల్ బెనర్జీ రావు కు ప్రశంసలు

### కలెక్టర్, ఆరోగ్య శాఖ మంత్రి, ఎస్పీ చేతుల మీదుగా సత్కారం.



చిత్తూరు, ఆగస్టు 15. చిత్తూరు జిల్లా పలమనేరు నియోజకవర్గంవికోట మండలం బైరుపల్లి గ్రామంలో జన్మించి 2006 సంవత్సరశీ లో పోలీస్ శాఖ లో సెలక్షన్ అయినారు. అక్కడ 3 సంవత్సరాల అనంతరం అక్టోపస్ నందు కఠినమైన కమాండో ట్రైనింగ్ చేసి 3 సంవత్సరాలు పనిచేసి అక్కడ నుండీ సివిల్ పోలీస్ గా చిత్తూరు డిస్టిక్ లో సెలెక్ట్ అయ్యి 14 సంవత్సరాలు పూర్తిచేసుకొన్నారు. ప్రస్తుతం స్పెషల్ టాస్క్ ఫోర్స్ నందు విధులు నిర్వహిస్తున్నాడు.ఈ మధ్యకాలంలో అందించిన సేవలకు గాను బెనర్జీరావు ను గుర్తించి అవార్డు ఇవ్వడం అయినది. ప్రజలకు మరియు పోలీస్ ఆఫీసర్స్ సహాయపడటంలో తన వంతు కృషి చేస్తున్నందుకు గర్వించదగిన గౌరవం లభించింది. చిత్తూరు జిల్లా కలెక్టర్ ఉ జిల్లా మేజిస్ట్రేట్, సుమిత్ కుమార్ ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య శాఖ మంత్రి, సత్య కుమార్ ,చిత్తూరు జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ తుషార్ డూడీ (ఫ్రా) చేతుల మీదుగా ప్రశంసలు అందుకున్నారు. అధికారుల చేతుల మీదుగా ప్రశంసలు అందుకోవడం తనకు ఎంతో సంతోషాన్ని, గర్వాన్ని కలిగించిందని బెనర్జీరావు శనివారం



పేర్కొన్నారు.తన సేవలను గుర్తించి ప్రోత్సహించిన జిల్లా కలెక్టర్, ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య శాఖ మంత్రి, జిల్లా ఎస్పీకి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.ఈ గౌరవం తనపై మరింత బాధ్యతను పెంచిందని, భవిష్యత్తులో కూడా ప్రజలకు డ్యూటీ విషయంలో మరింత బాధ్యత అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ప్రజలకు సేవ చేయడం తన ప్రధాన లక్ష్యమని, లభించిన ఈ గుర్తింపు మరింత సేవ చేయడానికి స్ఫూర్తినిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు బెనర్జీ రావుకు శుభాకాంక్షలు తెలిపారు.

# తిరుపతిలో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

తిరుపతి, మహి న్యూస్, ఆగస్టు 15: తిరుపతి నగరంలోని పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో 80వ భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి మాన్య శ్రీ ఆనం రామనారాయణ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ఎమ్మెల్యే అరణి శ్రీనివాసులు, జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బారాయుడు, జేసీ ఆర్. గోవిందరావు, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, తుడా చైర్మన్ డాలర్ దివాకర్ రెడ్డి, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, మాజీ మంత్రి పరసా రత్నం, డీఆర్వో నరసింహులు, మున్సిపల్ కార్పొరేషన్ ఇన్‌చార్జి కమిషనర్




శారదాదేవి, తిరుపతి, శ్రీకాళహస్తి ఆర్డీవోలు రామ్మోహన్, భానుప్రకాష్ రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ భరత్ నాయక్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ గీతాంజలి, ఏఎస్పీలు రవి మనోహరాచారి, శ్రీనివాస రావు, డి ఎస్ పి, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, ప్రజలు తదితరులు,పాల్గొన్నారు జాతీయ పతాకావిష్కరణ అనంతరం మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, జిల్లా కలెక్టర్, ఎస్పీ ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో పెరేడ్‌ను పరిశీలించారు. పోలీసు సిబ్బంది క్రమశిక్షణతో నిర్వహించిన కవాతు వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

### స్వాతంత్ర్య సమరయోధుడి కుటుంబ సభ్యుడికి సన్మానం

80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా రైల్వే కోడూరుకు చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు రాఘవ రాజు రామలింగరాజు కుమారుడు ఆర్. రాధాకృష్ణమ రాజును ముఖ్య అతిథులు ఘనంగా సన్మానించారు.

### అభివృద్ధి, సంక్షేమాన్ని చాటిన శకటాల ప్రదర్శన

జిల్లాలో అమలవుతున్న ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతిబింబించేలా వివిధ శాఖల ఆధ్వర్యంలో శకటాల ప్రదర్శన నిర్వహించారు. వ్యవసాయ, అనుబంధ శాఖలు, ఏపీఎస్‌పీడీసీఎల్, ఏపీఐఐసీ, పోలీస్ శాఖ-రక్షక్, వైద్య శాఖ-సంజీవని, తిరుపతి నగరపాలక సంస్థ-స్మార్ట్ సిటీ, తుడా, సూపర్-6, డ్వామా-వీబీజీ-రామ్‌జీ, అగ్నిమాపక-విపత్తుల నిర్వహణ శాఖ, విద్యా శాఖ-సమగ్ర శిక్ష, పశుసంవర్ధక శాఖ తదితర శాఖల శకటాలు ప్రదర్శనలో పాల్గొన్నాయి. శకటాల ప్రదర్శనలో ఏపీఐఐసీ శకటానికి ప్రథమ బహుమతి, పాఠశాల విద్యా శాఖ-సమగ్ర శిక్ష శకటానికి ద్వితీయ బహుమతి, ఏపీఎస్‌పీడీసీఎల్ (విద్యుత్ శాఖ) శకటానికి తృతీయ బహుమతి, తుడా శకటానికి కన్సోలేషన్ బహుమతి లభించాయి.




### ఆకట్టుకున్న డాగ్ షో

పోలీస్ శాఖ క్లూస్ టీమ్ ఆధ్వర్యంలో నిర్వహించిన డాగ్ షో కార్యక్రమానికి హాజరైన అతిథులు, అధికారులు, ప్రజా ప్రతినిధులు, విద్యార్థులు, ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది. పోలీసు శాఖలో కీలక సేవలందిస్తున్న శిక్షణ పొందిన శునకాల ప్రదర్శన వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. డాగ్ షో నిర్వహించిన బృందానికి మంత్రి చేతుల మీదుగా అవార్డు అందజేశారు.

### అలరించిన దేశభక్తి సాంస్కృతిక కార్యక్రమాలు

వివిధ పాఠశాలల విద్యార్థులు దేశభక్తి, జాతీయ సమైక్యతను ప్రతిబింబించే గీతాలు, నృత్య ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. వీ+వీ హైస్కూల్, తిరుపతి అర్బన్ విద్యార్థులు గరుడ గమన తవ గీతం, ాౄఌఔ=ా విద్యార్థులు వందేమాతరం, నారాయణ జువీ స్కూల్ విద్యార్థులు హో జై హో నా భారతం, విశ్వం జువీ స్కూల్ విద్యార్థులు పేట్రియాటిక్ థీమ్, వీజీౄాాదీజ వెల్ఫేర్ స్కూల్ (గర్ల్స్) విద్యార్థులు ఆదివాసీ పాట, ఎ×ఌాూ జువీ స్కూల్ విద్యార్థులు బంజారా సాంగ్, ఖ+దీఎ ఎర్రావారిపాలెం విద్యార్థులు బోలో ఉయ్ ఆర్ ఇండియన్, ాూాూ× జువీ స్కూల్ విద్యార్థులు వేదభూమి ఇది వీరభూమి ఇది వంటి ప్రదర్శనలు నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రథమ బహుమతి ఎంజీపీఏపీసీ వెల్ఫేర్ స్కూల్ (గర్ల్స్), తిరుపతి రూరల్, ద్వితీయ బహుమతి విద్యాస్ ఈఎమ్ స్కూల్, శ్రీనివాస మంగాపురం, తృతీయ బహుమతి ఏపీటిడబ్ల్యుఆర్ఎస్ స్కూల్, తిరుపతి అర్బన్ విద్యార్థులు సాధించారు. విజేతలకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా సర్టిఫికెట్లు, మెమెంటోలు అందజేశారు. కార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థులందరికీ కూడా సర్టిఫికెట్లు అందజేశారు.

### ఉత్తమ సేవలకు అవార్డులు

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా పోలీసు శాఖలో ఉత్తమ సేవలందించిన సిబ్బందికి ఉత్కృష్ట, అతి ఉత్కృష్ట సేవా పతకాలను, జిల్లా అధికారులకు అవార్డులను అందజేశారు. అదేవిధంగా వివిధ శాఖల్లో ఉత్తమ సేవలు అందించిన 165 మంది సిబ్బందికి అవార్డులు ప్రదానం చేశారు. శకటాల ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు, డాగ్ షో బృందానికి కూడా అవార్డులను రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి చేతుల మీదుగా అందజేశారు.

### స్టాల్స్ పరిశీలన, రుణాల మంజూరు

పోలీస్, చేనేత మరియు జౌళి, మెప్మా, ఐ సి డి ఎస్, డి ఆర్ డి ఏ, పట్టుపరిశ్రమ, అటవీ, మత్స్య, వైద్య, పశు సంవర్ధక శాఖల ద్వారా ఏర్పాటు చేసిన స్టాల్స్ ను జిల్లా కలెక్టర్ డా.ఎస్ వెంకటేశ్వర్, ఎస్ పి ఎల్. సుబ్బారాయుడు, తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ జయ కృష్ణ, డి ఆర్ ఓ జి.నరసింహులు, తదితరులు పరిశీలించారు అనంతరం డి ఆర్ డి ఏ, సెర్ప్ ద్వారా బ్యాంక్ లింకేజి, స్త్రీ నిధి, మహిళల ఆధ్వర్యంలోని పారిశ్రామిక కార్యక్రమాలు మరియు ఉన్నతి పథకాల ద్వారా 10,351 స్వయం సహాయక సంఘాల కు చెందిన 74,956 మందికి రూ.1,031 కోట్ల మెగా చెక్కును, మెప్మా ద్వారా




బ్యాంక్ లింకేజి కింద 1,298 ఎస్ హెచ్ జీ సంఘాలకు చెందిన 13,020 మందికి ఆర్థిక సహాయంగా రూ.150 కోట్ల మెగా చెక్కును, చాగనం లలితమ్మ ట్రస్టు, పెళ్లకూరు వారు తిరుపతి రుయా ఆసుపత్రికి రూ.35 లక్షల విలువైన వైద్య పరికరాలను అందజేసిన 2 వెంటిలేటర్లు, 2 డిఫిబ్రిలేటర్లు మరియు 20 అత్యవసర ట్రాలీ లను జిల్లా కలెక్టర్ పంపిణీ చేశారు. దేశభక్తి, జాతీయ సమైక్యత, ప్రభుత్వ అభివృద్ధి--సంక్షేమ కార్యక్రమాలు, విద్యార్థుల ప్రతిభ, పోలీసు శాఖ సేవలను ప్రతిబింబిస్తూ సాగిన ఈ వేడుకలు జాతీయ గీతాలపనతో ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా ముగిశాయి

# జిల్లా కలెక్టర్ కార్యాలయం లో 80 వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు

తిరుపతి, మహి న్యూస్, ఆగస్టు 15: భావితరాలకు స్ఫూర్తిగా నేడు 80 వ స్వాతంత్ర దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించుకుందామని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ తెలిపారు. శనివారం స్థానిక కలెక్టరేట్ కార్యాలయంలో 80 వ స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా. ఎస్ వెంకటేశ్వర్, జాయింట్ కలెక్టర్ ఆర్. గోవింద రావు, జిల్లా రెవెన్యూ అధికారి జి. నరసింహులు, కార్యాలయ సిబ్బందితో కలిసి పతాకావిష్కరణ గావించి స్ఫూర్తి సందేశాన్ని ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ప్రతి భారతీయుడిలో దేశభక్తి, జాతీయ స్ఫూర్తిని మరింత పెంపొందించేలా నిర్వహించాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందిస్తూ దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. 80 వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జిల్లా ప్రజలకు, ప్రజాప్రతినిధులకు, అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు, యువతకు ఆయన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఏడాది స్వాతంత్ర్య దినోత్సవం ప్రత్యేకతను సంతరించుకుందని కలెక్టర్ పేర్కొన్నారు. దేశ రాజధాని న్యూఢిల్లీలోని ఎర్రకోట నుంచి ప్రధానమంత్రి జాతీయ జెండాను ఆవిష్కరించే కార్యక్రమం నుంచి దేశవ్యాప్తంగా చిన్న కార్యాలయం వరకు తొలిసారిగా 'వందేమాతరం' గీతాన్ని సంపూర్ణంగా ఆలపించడం ద్వారా జాతీయ స్ఫూర్తిని చాటుకున్నామని తెలిపారు. ఈ చారిత్రాత్మక సందర్భంలో తాను కూడా భాగస్వామి కావడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. జిల్లా కలెక్టర్‌గా మూడోసారి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొనడం తనకు లభించిన గొప్ప అవకాశం అని పేర్కొన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం, గణతంత్ర దినోత్సవం వంటి జాతీయ పర్వదినాల సందర్భంగా ప్రతి ఒక్కరూ దేశభక్తి, జాతీయవాద స్ఫూర్తిని నిరంతరం గుర్తుంచుకోవాలని కలెక్టర్ సూచించారు. గత కొన్ని రోజులుగా జిల్లాలో నిర్వహించిన 'హర్ ఘర్ తిరంగా' ర్యాలీలు, వివిధ కార్యక్రమాలు, అధికారులు తమ విజన్ మరియు ప్రజలకు అందించాలనుకున్న సందేశాలను తెలియజేసే కార్యక్రమాలు ప్రజల్లో జాతీయ స్ఫూర్తిని పెంపొందించేందుకు దోహదపడ్డాయని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాలు, ముఖ్యమైన ప్రదేశాలను జాతీయ జెండా రంగులతో అలంకరించడం, జాతీయ స్ఫూర్తిని ప్రతిబింబించే కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ముఖ్యంగా చిన్నారుల్లో చిన్ననాటి నుంచే దేశభక్తి భావనను పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. చిన్న వయస్సులోనే దేశం పట్ల ప్రేమ, బాధ్యత, అభివృద్ధి పట్ల దృక్పథం ఏర్పడితే వారు భవిష్యత్తులో భారతదేశాన్ని మరింత అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దేందుకు తమ వంతు సేవలు అందిస్తారని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులుగా ప్రజలకు సేవ చేయడంలో ప్రతి ఒక్కరూ అత్యంత బాధ్యతతో వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. విధి నిర్వహణలో ఏదైనా సందేహం ఎదురైనప్పుడు జాతిపిత మహాత్మా గాంధీ చూపిన మార్గాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని అన్నారు. తమ నిర్ణయం లేదా చర్య వల్ల ఒక్క పేదవాడికైనా ప్రయోజనం కలుగుతుందా అనే అంశాన్ని ప్రాధాన్యంగా పరిగణనలోకి తీసుకుని పనిచేస్తే ప్రజా సేవకు నిజమైన సార్థకత చేకూరుతుందని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగుల విధి నిర్వహణలో అనేక సవాళ్లు ఎదురవుతాయని, అయితే ప్రజా సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగితే ప్రతి సవాలును సమర్థవంతంగా అధిగమించవచ్చన్నారు. తాము చేసే ప్రతి పని పేదరిక నిర్మూలనకు దోహదపడేలా ఉండాలని, ప్రతి ప్రభుత్వ చర్య దేశ అభివృద్ధికి ఒక మెట్టుగా నిలవాలని ఆకాంక్షించారు. భారతదేశం ప్రపంచంలోనే అత్యంత అభివృద్ధి చెందిన దేశంగా ఎదగడానికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని కలెక్టర్ కోరారు. సమాజంలోని ప్రతి వర్గానికి సమాన అవకాశాలు, సామాజిక గౌరవం, ఆర్థిక భద్రత, సంతోషకరమైన జీవనం అందేలా ప్రభుత్వ యంత్రాంగం కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. సామాజిక, ఆర్థిక, మానవ అభివృద్ధి రంగాల్లో ప్రతి ఒక్కరూ సమాన స్థాయికి చేరుకునేలా ప్రభుత్వ ఉద్యోగులు ప్రజాసేవను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయులను స్మరించుకుంటూ, వారి ఆశయాలకు అనుగుణంగా సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జాయింట్ కలెక్టర్ ఆర్. గోవింద రావు, జిల్లా రెవెన్యూ అధికారి జి నరసింహులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు భరత్ నాయక్,శివ శంకర్ నాయక్, రామాంజునమ్మ, ట్రైని డిప్యూటీ కలెక్టర్ గీతాంజలి, జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బయోగ్యాస్ స్టాల్ ను ప్రశంసించిన

## రాష్ట్ర వైద్య విద్య శాఖ మంత్రివర్యులు సత్య కుమార్ యాదవ్

**చిత్తూరు, మహి న్యూస్, ఆగస్టు 15:** బయో గ్యాస్ స్టాల్ ను ప్రశంసించినరాష్ట్ర వైద్య విద్య శాఖ మంత్రివర్యులు సత్య కుమార్ యాదవ్ పేర్కొన్నారు. శనివారం జిల్లాలో 80 స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా వేడుకలు భాగంగా జిల్లా అధికారులు ఏర్పాటుచేసిన వివిధ స్టాల్స్ ను మంత్రివర్యులు పరిశీలించారు, ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ ఏ శ్రీనివాసులు, స్థానిక ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, జిల్లా ఎస్పీ ఎస్పీ తుషార్ డుడి, కడపిడి వికాస్ మరమ్మత్ ,జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, ట్రైనింగ్ కలెక్టర్ వెంకటేష్, అడిషనల్ ఎస్పీ, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బయోగ్యాస్ స్టాల్ నందురాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రివర్యులు సత్య కుమార్ యాదవ్ పశువుల పేడతో బయోగ్యాస్ ఉత్పత్తి -- సేంద్రియ వ్యవసాయానికి వ్యర్థ పదార్థాల వినియోగం నిర్వాహకులను తెలుసుకున్నారు వారు మాట్లాడుతూ పశువుల పేడను వినియోగించి బయోగ్యాస్‌ను ఉత్పత్తి చేసి, వంట గ్యాస్‌గా ఉపయోగించుకోవడంతో పాటు, బయోగ్యాస్ ప్లాంట్ నుంచి వెలువడే వ్యర్థ పదార్థాలను సేంద్రియ వ్యవసాయానికి వినియోగించుకునే విధంగా యూనిట్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ బయోగ్యాస్ యూనిట్‌కు రోజుకు సుమారు 40 కిలోల పశువుల పేడ అవసరమవుతుంది. ప్రతిరోజూ 40 కిలోల పేడను ప్లాంట్‌లో వేయడం ద్వారా రెండో రోజు నుంచి బయోగ్యాస్ ఉత్పత్తి ప్రారంభమవుతుంది. ఒక నెలలో సుమారు ఒకటిన్నర సిలిండర్లకు సమానమైన వంట గ్యాస్‌ను ఉత్పత్తి చేసుకోవచ్చు. బయోగ్యాస్ యూనిట్‌లో డైజెస్టర్, టబ్, పైపులు, స్టవ్ తదితర అవసరమైన పరికరాలన్నీ అందుబాటులో ఉంటాయి. సబ్సిడీ ద్వారా ఈ యూనిట్లను ఏర్పాటు చేస్తున్నందున రైతులకు ఆర్థికంగా ప్రయోజనం చేకూరుతుంది. తమ వద్ద రోజుకు 40 కిలోల పశువుల పేడ అందుబాటులో ఉన్న రైతులు ఈ యూనిట్‌ను వినియోగించుకుని వంట గ్యాస్‌ను స్వయంగా ఉత్పత్తి చేసుకోవచ్చు. ఈ ప్రాజెక్టును స్వర్ణ రీఫ్ సంస్థ నిర్వహిస్తోంది. ఇది వాతావరణ మార్పులపై పనిచేసే సంస్థగా, వాతావరణ మార్పుల నియంత్రణలో భాగంగా బయోగ్యాస్, అగ్రోఫారెస్ట్రీ, బయోచార్ తదితర ప్రాజెక్టులను అమలు చేస్తోంది. మంత్రివర్యులు మాట్లాడుతూ విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు

EDITOR and PUBLISHER and OWNED BY NEELI RAMASUBBAIAH, PUBLISHED 9147/1, SRI LAKSHMI NARASIMHA YOGIMAILAVARAM ARCH ROAD, YOGIMAILAVARAM,TIRUPATHI,AP - 517503.A.P .VSAR PUBLICATIONSDOOR NO. 403, PANTA STREET, TIRUPATHI - 517501.RNI NO : APTEL/26/A5325. Cell 90 59 58 58 98. Email : mahinewsindia@gmail.com, website : https//epaper.mahinewsindia.com

RNI : APTEL/25/A0108
www.mahinewsindia.com
మహి న్యూస్
తెలుగు దినపత్రిక
epaper: https://epaper.mahinewsindia.com
జనరల్ న్యూస్
ఆదివారం - 16- ఆగష్టు- 2026

# కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

**జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి గౌరవ వందనం సమర్పించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి**



కర్నూలు, ఆగస్టు 15: (మహి న్యూస్) : కర్నూలు జిల్లా కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి గౌరవ వందనం సమర్పించారు. దేశ స్వాతంత్ర్యం కోసం తమ ప్రాణాలను త్యాగం చేసిన స్వాతంత్ర్య సమరయోధుల సేవలు, త్యాగాలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల స్ఫూర్తితో ప్రజా సంక్షేమం, జిల్లా అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జిల్లా ప్రజలకు కలెక్టర్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ప్రయోజనాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ మరింత సమర్థవంతంగా చేరేలా కృషి చేయాలని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ క్యాంప్ కార్యాలయ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# లోకాయుక్త కార్యాలయంలో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

**జాతీయ జెండాను ఆవిష్కరించిన ఉప లోకాయుక్త శ్రీమతి పి. రజిని**







కర్నూలు, ఆగస్టు 15: (మహి న్యూస్) : 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని కర్నూలులోని లోకాయుక్త కార్యాలయ ఆవరణలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. జాతీయ సమైక్యత, దేశభక్తి, ప్రజాస్వామ్య విలువలను ప్రతిబింబించేలా అధికారులు, సిబ్బంది, పోలీసు సిబ్బంది, విద్యార్థుల సమక్షంలో వేడుకలు ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. కార్యక్రమానికి హాజరైన ఉప లోకాయుక్త శ్రీమతి పి. రజిని తొలుత మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి జాతీయ జెండాకు వందనం గావించారు. ఈ సందర్భంగా దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయులను స్మరించుకుంటూ వారి సేవలను కొనియాడారు. జాతీయ పతాకావిష్కరణ అనంతరం పోలీసు సిబ్బంది, విద్యార్థులు నిర్వహించిన గౌరవ వందనాన్ని ఉప లోకాయుక్త స్వీకరించారు. దేశభక్తి, జాతీయ సమైక్యత, క్రమశిక్షణకు ప్రతీకగా నిలిచిన ఈ కార్యక్రమం వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని లోకాయుక్త కార్యాలయ సిబ్బంది నిర్వహించిన వివిధ క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచిన విజేతలు, రన్నర్స్‌కు బహుమతులు అందజేశారు. క్రీడా స్ఫూర్తి, ఆరోగ్యకరమైన పోటీ తత్వం, సిబ్బందిలో ఉత్సాహాన్ని పెంపొందించేలా ఈ కార్యక్రమాలను నిర్వహించారు ఈ సందర్భంగా స్వాతంత్ర్య దినోత్సవ ప్రాధాన్యతను వివరిస్తూ దేశ అభివృద్ధి, ప్రజాసేవ, ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తించాలని ఉప లోకాయుక్త పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ ఇన్వెస్టిగేషన్ పి. వెంకటరామరెడ్డి, రిజిస్ట్రార్ టి. వెంకటేశ్వరరెడ్డి, లోకాయుక్త కార్యాలయ అధికారులు, సిబ్బంది, పోలీసు సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# 17న నగరమంతా తాగునీటి సరఫరాకు అంతరాయం

## నీటి శుద్ధి కేంద్రంలో నిర్వహణ పనులు చేపట్టనున్న నగరపాలక సంస్థ



కర్నూలు, ఆగస్టు 15: (మహి న్యూస్) : కర్నూలు నగరంలోని అశోక్ నగర్ వద్ద ఉన్న 42.70 ఎంఎల్‌డీ నీటి శుద్ధి కేంద్రంలో నిర్వహణ పనులు చేపట్టనున్న నేపథ్యంలో ఈ నెల 17న సోమవారం నగరవ్యాప్తంగా తాగునీటి సరఫరాకు అంతరాయం కలగనుంది. ఈ విషయాన్ని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తొలుత నగరంలోని కొన్ని కాలనీల్లో మాత్రమే తాగునీటి సరఫరాకు అంతరాయం ఉంటుందని భావించినప్పటికీ, నీటి శుద్ధి కేంద్రంలోని అన్ని యంత్రాల సామర్థ్యాన్ని తనిఖీ చేయడంతో పాటు అవసరమైన నిర్వహణ పనులు చేపట్టాల్సి ఉన్నందున నగరమంతటా నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని కమిషనర్ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు ముందుగానే తగినంత నీటిని నిల్వ చేసుకోవాలని, నీటిని పొదుపుగా వినియోగించాలని కమిషనర్ సూచించారు. నిర్వహణ పనులకు ప్రజలు సహకరించాలని కోరారు.

# ప్రగతి పథంలో 'నగర' అడుగులు

## నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు

**మున్సిపల్ కార్యాలయంలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు**



కర్నూలు, ఆగస్టు 15: (మహి న్యూస్) : కర్నూలు నగరాన్ని అభివృద్ధి పథంలో మరింత ముందుకు తీసుకెళ్లేందుకు సమష్టిగా అడుగులు వేస్తున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు అన్నారు. శనివారం వెంకటరమణ కాలనీలోని నగరపాలక సంస్థ కార్యాలయంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా స్వాతంత్ర్య సమరయోధుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించిన కమిషనర్ అనంతరం త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు, పోరాటాల ఫలితంగానే దేశానికి స్వాతంత్ర్యం లభించిందన్నారు. వారి ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని దేశ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కర్నూలు నగరాన్ని మరింత అభివృద్ధి, పరిశుభ్రత, సుందరీకరణ దిశగా తీసుకెళ్లేందుకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని కమిషనర్ సూచించారు. ప్రజలకు మెరుగైన పౌర సేవలు అందించడంతో పాటు నగర అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. అనంతరం వివిధ విభాగాల్లో అత్యుత్తమ విధులు నిర్వహించిన అధికారులు, ఉద్యోగులకు కమిషనర్ ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, మేనేజర్ జునైద్, కార్యదర్శి నాగరాజు, ఎస్‌ఈ రమణమూర్తి, ప్రజారోగ్య అధికారి డాక్టర్ ఎం. రఘు, ఆర్వోలు మంజూర్ బాష, క్రిస్టోఫర్, ఇన్‌చార్జి డీసీపీ శబ్నం శాస్త్రి, అకౌంట్స్ ఆఫీసర్ రఘునందన్, వివిధ విభాగాల అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.





# స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబ సభ్యులకు ఘన సన్మానం

## త్యాగాలను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత: మంత్రి టి.జి. భరత్



కర్నూలు, ఆగస్టు 15: (మహి న్యూస్) : 80వ భారత స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని కర్నూలు పోలీస్ పెరేడ్ మైదానంలో స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబ సభ్యులను ఘనంగా సన్మానించారు. జెండా వందనం అనంతరం రాష్ట్ర పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్, వాణిజ్య శాఖ మంత్రి టి.జి. భరత్ స్వాతంత్ర్య సమరయోధుల వారసులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి టి.జి. భరత్ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం తమ జీవితాలను త్యాగం చేసిన స్వాతంత్ర్య సమరయోధుల సేవలను, త్యాగాలను ఎప్పటికీ స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వారి కుటుంబ సభ్యులను గౌరవించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. స్వాతంత్ర్య సమరంలో పాల్గొని దేశం కోసం తమ జీవితాలను త్యాగం చేసిన మహనీయుల స్ఫూర్తిని భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల ఫలితంగానే నేడు మనం స్వేచ్ఛా వాయువులు పీలుస్తున్నామని మంత్రి పేర్కొన్నారు.







సన్మానం పొందిన స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబ సభ్యులు:

1. గుర్రం జైపాల్ రెడ్డి, గుర్రం వెంకట రెడ్డి కుమారుడు, కెవిఆర్ గార్డెన్, కర్నూలు.
2. ఎస్. ఉమాదేవి, సర్దార్ బుచ్చిబాబు సతీమణి, నాగప్ప వీధి, కర్నూలు.
3. శ్రీమతి జి. సుబ్బమ్మ, జి. సత్యనారాయణ సతీమణి, కాలే కరీం మస్జిద్, కర్నూలు.
4. శ్రీమతి ఎం.సి. ఎంకమ్మ, ఎం.సి. శుభకర్ సతీమణి, చిన్నా మార్కెట్, కర్నూలు.
5. ఎస్.డి. నరేంద్ర ప్రసాద్, ఎస్.డి. నారాయణరావు కుమారుడు, కర్నూలు టౌన్.
6. డి. రాధాకృష్ణమూర్తి, డి. చెన్నయ్య కుమారుడు, బాలాజీనగర్, కర్నూలు.
7. ఎస్.ఐ. భాష బియాబాని, ఎస్.ఎం.కె. బియాబాని కుమారుడు, జర్నలిస్ట్ కాలనీ, కర్నూలు.
8. కల్నల్ ఐ.ఎస్. సయ్యద్, శిల్పా సింగపూర్ టౌన్‌షిప్, కర్నూలు.
9. కె. చంద్రకాంత్, తుక్కోజీరావు కుమారుడు, ఆలూరు.
10. విష్ణువర్ధన్, ఆలూరు. స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబ సభ్యులను రాష్ట్ర పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్, వాణిజ్య శాఖ మంత్రి టి.జి. భరత్, జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ దుశాలువలు కప్పి, పూలమాలలతో ఘనంగా సన్మానించారు.



# 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా అభివృద్ధిని ప్రతిబింబిస్తూ వివిధ శాఖల స్టాల్స్ ఏర్పాటు

**స్టాల్స్‌ను సందర్శించి పరిశీలించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్**

కర్నూలు, ఆగస్టు 15: (మహి న్యూస్) : 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని కర్నూలు పోలీస్ పరేడ్ మైదానంలో ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతిబింబించేలా వివిధ శాఖల ఆధ్వర్యంలో స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. ఆయా శాఖలు తమ పరిధిలో అమలు చేస్తున్న ప్రభుత్వ పథకాలు, ప్రజలకు అందిస్తున్న సేవలు, సాధించిన ప్రగతి, లబ్ధిదారులకు కలుగుతున్న ప్రయోజనాలను వివరించేలా స్టాల్స్‌ను తీర్చిదిద్దారు. స్టాల్స్ ఏర్పాటు చేసిన శాఖలు: 1. సమాచార పౌర సంబంధాల శాఖ 2. వైద్య మరియు ఆరోగ్య శాఖ 3. జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) 4. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా), కర్నూలు 5. మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ 6. పౌరసరఫరాల శాఖ 7. జిల్లా నీటి యాజమాన్య సంస్థ మరియు జలవనరుల శాఖ 8. చేనేత మరియు జౌళి శాఖ 9. సంక్షేమ శాఖలు 10. ఎస్సీ, బీసీ మరియు మైనార్టీ కార్పొరేషన్లు 11. ఉద్యాన శాఖ 12. ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ నీటిపారుదల పథకం (ఏపీఎంఐపీ) 13. ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ (ఏపీఎఫ్‌ఎస్) 14. పశు సంవర్ధక శాఖ 15. విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ / విభిన్న ప్రతిభావంతులు మరియు వయోవృద్ధుల సహాయ సంస్థ 16. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ 17. రోడ్లు మరియు భవనాల శాఖ ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించే విధంగా స్టాల్స్‌లో సమాచారాన్ని ప్రదర్శించారు. ఆయా పథకాల ద్వారా లబ్ధిదారులకు అందుతున్న ప్రయోజనాలు, వివిధ కార్యక్రమాల ద్వారా సాధించిన ప్రగతిని ప్రజలకు వివరించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల అనంతరం జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ తదితర అధికారులు స్టాల్స్‌ను సందర్శించి ఆయా శాఖలు ఏర్పాటు చేసిన ప్రదర్శనలను పరిశీలించారు. శాఖల వారీగా ప్రదర్శించిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాల ద్వారా ప్రజలకు అందుతున్న సేవలు, జిల్లాలో జరుగుతున్న అభివృద్ధిని ఒకే వేదికపై ప్రదర్శించడం ద్వారా ఈ స్టాల్స్ సందర్శకులను ఆకట్టుకున్నాయి.











# రాష్ట్రస్థాయి పరేడ్‌లో కర్నూలు ఏపీఎస్పీ 2వ బెటాలియన్‌కు ప్రథమ స్థానం

## ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా విజేత ట్రోఫీ అందుకున్న డీఎస్పీ మహబూబ్ బాషా



కర్నూలు, ఆగస్టు 15: (మహి న్యూస్) : రాష్ట్రస్థాయిలో నిర్వహించిన 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా నిర్వహించిన ప్రతిష్ఠాత్మక పరేడ్‌లో కర్నూలు ఏపీఎస్పీ 2వ బెటాలియన్ సిబ్బంది సత్తా చాటారు. రాష్ట్రంలోని వివిధ పోలీస్ బలగాలకు చెందిన కంటింజెంట్లు పాల్గొన్న ఈ పరేడ్‌లో కర్నూలు ఏపీఎస్పీ 2వ బెటాలియన్ సిబ్బంది క్రమశిక్షణ, సమన్వయం, అద్భుతమైన కవాతుతో ఆకట్టుకుని ప్రథమ స్థానాన్ని దక్కించుకున్నారు. ఈ సందర్భంగా కర్నూలు ఏపీఎస్పీ 2వ బెటాలియన్ డీఎస్పీ మహబూబ్ బాషా విజేత ట్రోఫీని గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా అందుకున్నారు. రాష్ట్రస్థాయి ప్రతిష్ఠాత్మక పరేడ్‌లో ప్రథమ స్థానం సాధించడం పట్ల ఏపీఎస్పీ 2వ బెటాలియన్ సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. తమ క్రమశిక్షణ, సమన్వయం, అంకితభావానికి ఈ విజయం నిదర్శనమని పేర్కొన్నారు.



# ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

## దేశభక్తి గీతాలు, జానపద గేయాలతో అలరించిన విద్యార్థిని, విద్యార్థులు



కర్నూలు, ఆగస్టు 15: (మహి న్యూస్) : 80వ భారత స్వాతంత్ర్య దినోత్స వాన్ని పురస్కరించు కుని కర్నూలు పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జిల్లాలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన విద్యార్థిని, విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి. డా. బి.ఆర్. అంబేద్కర్ గురుకులం, దిన్నెదేవరపాడు, నేతాజీ సుభాష్ చంద్రబోస్ అవాస విద్యాలయం, బి.క్యాంప్, కర్నూలు, కరాటే టైక్వాండో--ఆత్మరక్షణ, కేజీబీవీ కృష్ణగిరి, సెయింట్ జోసెఫ్ సంస్థలకు చెందిన విద్యార్థులు దేశభక్తి గీతాలు, జానపద గేయాలకు ఉత్సాహభరితంగా ప్రదర్శనలు నిర్వహించారు. విద్యార్థుల ప్రదర్శనల్లో దేశభక్తి, జాతీయ సమైక్యత, సాంస్కృతిక వైవిధ్యం ప్రతిబింబించాయి. విద్యార్థుల నృత్యాలు, ప్రదర్శనలు ప్రేక్షకులను అలరించడంతో పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో సందడి నెలకొంది. సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ కనబరిచిన వారికి ప్రథమ బహుమతిగా సెయింట్ జోసెఫ్ సంస్థలు, కర్నూలుకు, ద్వితీయ బహుమతిగా కేజీబీవీ కృష్ణగిరికి, తృతీయ బహుమతిగా డా. బి.ఆర్. అంబేద్కర్ గురుకులం, దిన్నెదేవరపాడుకు, నాల్గవ బహుమతిగా నేతాజీ సుభాష్ చంద్రబోస్ అవాస విద్యాలయం, బి.క్యాంప్, కర్నూలుకు, ఐదవ బహుమతిగా కరాటే టైక్వాండో--ఆత్మరక్షణ బృందానికి బహుమతులు లభించాయి. విజేతలకు రాష్ట్ర మంత్రి టి.జి. భరత్, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. విద్యార్థుల ప్రతిభను అధికారులు అభినందించారు.



# కర్నూలు రేంజ్ డీఐజీ క్యాంపు కార్యాలయంలో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

**జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి గౌరవ వందనం స్వీకరించిన డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ ఐపీఎస్**



కర్నూలు, ఆగస్టు 15: (మహి న్యూస్) : కర్నూలు రేంజ్ డీఐజీ క్యాంపు కార్యాలయంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ ఐపీఎస్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి జెండా వందనం గావించారు. అనంతరం పోలీసు సిబ్బంది నుంచి గౌరవ వందనాన్ని డీఐజీ స్వీకరించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు, సిబ్బందికి స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సిబ్బందికి మిఠాయిలు అందజేశారు. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ, వారి ఆశయాలకు అనుగుణంగా విధులు నిర్వర్తించాలని డీఐజీ సూచించారు. కార్యక్రమంలో ఏఏఓ మాధవి, కర్నూలు రేంజ్ డీఐజీ కార్యాలయ మేనేజర్ రత్న ప్రకాష్, సీఐ (లైజనింగ్ ఆఫీసర్) తిక్కస్వామి, డీఐజీ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




# కర్నూలు ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

**జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి గౌరవ వందనం స్వీకరించిన ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్**



కర్నూలు, ఆగస్టు 15: (మహి న్యూస్) : కర్నూలు ఎస్పీ క్యాంపు కార్యాలయంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి జెండా వందనం గావించారు. అనంతరం పోలీసు సిబ్బంది నుంచి గౌరవ వందనాన్ని ఎస్పీ స్వీకరించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు, సిబ్బందికి స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పోలీసు సిబ్బందికి మిఠాయిలు అందజేశారు. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేలా విధులు నిర్వర్తించాలని ఎస్పీ సూచించారు. కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ సీఐలు మధుసూదనరావు, కేశవరెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఎస్సైలు ఖాజావళి, ఉస్మాన్, ఎస్పీ సీసీ సాకేత్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



EDITOR and PUBLISHER and OWNED BY NEELI RAMASUBBAIAH, PUBLISHED AT # 87/985-V-P-C-29,VIJAYAPURICOLONY, BESIDE KENDRIYA VIDYALAYA SCHOOL, NEAR NADHYAL CHECKPOST, KURNOOL-518001,KURNOOL DIST, A.P PRINTED AT VSAR PRINTERS, KURNOOL-518001.RNI NO : APTEL/26/A3560. Cell 90 59 58 58 98. Email : mahinewsindia@gmail.com, website : https//epaper.mahinewsindia.com

## శ్రావణ మాసంలో భక్తుల సందడి

### శ్రీ వెంకటేశ్వర స్వామికి విశేష పూజలు.. మొక్కులు చెల్లించుకున్న భక్తులు



గాలివీడు: ఆగష్టు15(మహి న్యూస్ ) : శ్రావణ మాసం సందర్భంగా మండలంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శ్రావణ మాసంలో స్వామివారిని దర్శించుకుని పూజలు చేస్తే కోరిన కోర్కెలు నెరవేరుతాయని భక్తుల విశ్వాసం. దీంతో ఉదయం నుంచే ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. భక్తులు స్వామివారికి అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. పూలు, పండ్లు, కొబ్బరికాయలు తదితర పూజా సామగ్రిని సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. శ్రావణ మాసం కావడంతో ఆలయ ప్రాంగణం భక్తులతో సందడిగా మారింది. స్వామివారి నామస్మరణ, భక్తుల పూజలతో ఆలయంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. పలువురు భక్తులు కుటుంబ సభ్యులతో కలిసి ఆలయానికి వచ్చి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. క్యూలైన్లను ఏర్పాటు చేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టారు. పూజా కార్యక్రమాలు ప్రశాంతంగా జరిగేలా ఆలయ సిబ్బంది, నిర్వాహకులు పర్యవేక్షించారు. శ్రావణ మాసం మొత్తం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు అర్చకులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరారు.

## దేశభక్తి నినాదాలతో విద్యార్థుల ర్యాలీ



గాలివీడు: ఆగష్టు15(మహి న్యూస్ ) : స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాల విద్యార్థులు శనివారం దేశభక్తి నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. పాఠశాల నుంచి ప్రారంభమైన ర్యాలీ ప్రధాన వీధుల మీదుగా కొనసాగింది. విద్యార్థులు చేతబట్టిన జాతీయ జెండాలతో 'వందేమాతరం', 'జైహింద్' అంటూ నినాదాలు చేస్తూ ప్రజల్లో దేశభక్తి స్ఫూర్తిని చాటారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను విద్యార్థులు స్మరించుకోవాలని, దేశ అభివృద్ధిలో యువత కీలక పాత్ర పోషించాలని సూచించారు. ర్యాలీలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## స్వాతంత్ర్య వేడుకల్లో ఆకట్టుకున్న జిల్లా పోలీస్ శాఖ స్టాల్



కడప, మహి న్యూస్ ఆగస్టు 15: 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా కడప పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో జిల్లా పోలీస్ శాఖ ఏర్పాటు చేసిన స్టాల్ సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంది. రాష్ట్ర రోడ్లు, భవనాలు, మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల శాఖ మంత్రి శ్రీ బి.సి. జనార్దన్ రెడ్డి.. జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి, జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ లతో కలిసి సైబర్ నేరాలపై అవగాహన కల్పించే పోస్టర్లను ఆవిష్కరించారు. జిల్లా ఎస్పీ శ్రీ షెల్కె నచికేత్ విశ్వనాథ్ పోలీస్ శాఖ అందిస్తున్న వివిధ సేవలను మంత్రికి వివరించారు. శక్తి బృందాలు, సైబర్ నేరాలు, డయల్--112, గృహ భద్రత పర్యవేక్షణ వ్యవస్థలపై పోలీస్ అధికారులు సందర్శకులకు అవగాహన కల్పించారు. 'డిజిటల్ అరెస్ట్' పేరుతో చట్టంలో ఎలాంటి వ్యవస్థ లేదని, సీబీఐ, ఈడీ, ఐటీ అధికారుల పేరుతో వీడియో కాల్స్ చేసి బెదిరించే సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. యువత, విద్యార్థులు ఉత్సాహంగా స్టాల్‌ను సందర్శించి పోలీసుల సూచనలు తెలుసుకున్నారు.

## పి.ఎం.శ్రీ కేంద్రీయ విద్యాలయంలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు




కడప, మహి న్యూస్ ఆగస్టు 15 : కడప పి.ఎం. శ్రీ కేంద్రీయ విద్యాలయంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీ మునేష్ మీనా ముఖ్య అతిథిగా హాజరై వేడుకలను నిర్వహించారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు దేశభక్తి, జాతీయ భావాలను ప్రతిబింబించేలా ప్రదర్శించిన నాటికలు, నృత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. విద్యార్థుల ప్రతిభను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, సిబ్బంది అభినందించారు. ఈ సందర్భంగా ప్రసంగించిన వక్తలు స్వాతంత్ర్య దినోత్సవ ప్రాముఖ్యతను వివరిస్తూ.. స్వేచ్ఛా భారతదేశం సాధించిన ప్రగతి, దేశ నిర్మాణంలో యువత పాత్ర గురించి వివరించారు. భావి భారతదేశాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడంలో విద్యార్థులు బాధ్యతాయుత పౌరులుగా ఎదగాలని సూచించారు. కార్యక్రమం ముగింపులో పీజీటీ కంప్యూటర్ సైన్స్ ఉపాధ్యాయులు శ్రీ శ్రీనివాస్ రావు వందన సమర్పణ చేశారు. అనంతరం విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేశారు.

## ఉత్తమ కంప్యూటర్ ఆఫరేటర్ గా నరసింహా రెడ్డి



గాలివీడు ఆగస్టు15(మహి న్యూస్) : గాలివీడు మండల విద్యాశాఖ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్న బి. నర్సింహారెడ్డి "ఉత్తమ కంప్యూటర్ ఆపరేటర్"గా ఎంపికై సత్కారం అందుకున్నారు. దేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా జిల్లా కేంద్రం మదనపల్లి లో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రివర్యులు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి గారి చేతుల మీదుగా బి. నర్సింహారెడ్డి ఉత్తమ కంప్యూటర్ ఆపరేటర్ అవార్డును అందుకున్నారు. విద్యాశాఖ కార్యాలయంలో కంప్యూటర్ సంబంధిత పనులను సమర్థవంతంగా నిర్వహిస్తూ, ప్రభుత్వ కార్యక్రమాలు, విద్యార్థుల వివరాలు, పాఠశాలల సమాచారాన్ని సకాలంలో నమోదు చేయడంలో చూపిన నిబద్ధత, క్రమశిక్షణ, సేవాభావం మరియు ప్రతిభకు గుర్తింపుగా ఈ అవార్డు లభించింది.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదుకూరులో వైభవంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



మైదుకూరు మహి న్యూస్ ఆగష్టు 15. : ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మైదుకూరులో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి. నారాయణ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి మైదుకూరు శాసనసభ్యులు గౌరవనీయులు శ్రీ పుట్టా సుధాకర్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ పి. నారాయణ రెడ్డి స్వాగతోపన్యాసం చేస్తూ, క్రమశిక్షణ, నాణ్యమైన బోధన, ఉత్తమ అధ్యాపకుల కృషితో కళాశాల విద్యార్థులు విశ్వవిద్యాలయ స్థాయి ర్యాంకులు సాధిస్తూ



విద్యా రంగంలో ముందంజలో ఉన్నారని తెలిపారు. 2008లో ప్రారంభమైన ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదుకూరు అనేక రంగాల్లో పురోగతి సాధించడం శుభపరిణామమన్నారు. గత సంవత్సరం కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు జాతీయ స్థాయిలో రిపబ్లిక్ డే వేడుకల్లో పాల్గొనడం, జాతీయ సమైక్యత శిబిరాల్లో పాల్గొనడం కళాశాలకు గర్వకారణమని పేర్కొన్నారు. అయితే కళాశాల ప్రారంభమై 18 సంవత్సరాలు పూర్తవుతున్నప్పటికీ సొంత భవనం లేకపోవడం వల్ల విద్యార్థులు, అధ్యాపకులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్య అతిథి ఎమ్మెల్యే శ్రీ పుట్టా సుధాకర్ యాదవ్ మాట్లాడుతూ, ఎందరో మహానుభావుల త్యాగాలు, పోరాటాల ఫలితంగానే దేశానికి స్వాతంత్ర్యం లభించిందని, వారి సేవలను ప్రతి ఒక్కరూ ఎప్పటికీ స్మరించుకోవాలని అన్నారు. మైదుకూరు నియోజకవర్గ ప్రజలు తనను ఎమ్మెల్యేగా ఎన్నుకోవడం తనకు లభించిన గొప్ప బాధ్యతగా భావిస్తున్నానని తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయడం తన బాధ్యతగా తీసుకుంటానని, కళాశాల అభివృద్ధికి అహర్నిశలు సహకరిస్తానని హామీ ఇచ్చారు. సభను ఉద్దేశించి శ్రీ రాధారామ్ మాట్లాడుతూ, వందేమాతరం గీతానికి 150 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా కళాశాలలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రశంసించారు. కళాశాల విద్యార్థులు సుమారు 3 నిమిషాల 50 సెకండ్ల పాటు వందేమాతరం గీతాన్ని సమష్టిగా ఆలపించడం అభినందనీయమన్నారు. విద్యార్థులు విద్యతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ చురుకుగా పాల్గొంటూ కళాశాలకు, మైదుకూరు పట్టణానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీ గురప్ప మాట్లాడుతూ, ఎన్ఎస్ఎస్ సేవా కార్యక్రమాల్లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ముందంజలో ఉందన్నారు. జాతీయ సమైక్యత శిబిరాలు, ప్రత్యేక శిబిరాల ద్వారా విద్యార్థుల్లో సామాజిక బాధ్యత, నాయకత్వ లక్షణాలు, సర్వతోముఖ అభివృద్ధిని పెంపొందిస్తున్నామని తెలిపారు. క్రమశిక్షణతో కూడిన బోధన, ప్రయోగశాలల ద్వారా విద్యార్థులకు జీవన నైపుణ్యాలు, వృత్తి నైపుణ్యాలను అభివృద్ధి చేసే ఉత్తమ విద్యాసంస్థగా కళాశాల ఎదుగుతోందని పేర్కొన్నారు. మైదుకూరు, పరిసర ప్రాంతాల విద్యార్థులు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అందుబాటులో ఉన్న విద్యా అవకాశాలను సద్వినియోగం చేసుకొని తమ ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చంద్రిక, గ్రేస్ నైటీ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు, స్వాతంత్ర్య ప్రాముఖ్యతపై ప్రసంగించి సభికులను ఆకట్టుకున్నారు. అనంతరం స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన వివిధ క్రీడా, సాంస్కృతిక మరియు ఇతర పోటీల్లో ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచిన విద్యార్థిని, విద్యార్థులకు ఎమ్మెల్యే శ్రీ పుట్టా సుధాకర్ యాదవ్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించి, మరింత ఉన్నత స్థాయిలో రాణించాలని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీ సుభాన్ సాహెబ్, తెలుగు అధ్యాపకురాలు శ్రీమతి అనురాధ లక్ష్మి, అధ్యాపకులు శ్రీనివాసులు, చెన్నరాయుడు, అయ్యవారు రెడ్డి, నవనీశ్వర్ రెడ్డి, ఈశ్వర్ రెడ్డి, కృష్ణారెడ్డి, నాగరాజు రెడ్డి, సుధీర్ రెడ్డి, పర్వీన్ కిషోర్, శివ, చెన్న రాయుడు తదితర అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థిని విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. దేశభక్తి, విద్య, క్రమశిక్షణ, సామాజిక బాధ్యతల సమన్వయంతో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా ముగిశాయి.

## సమష్టి కృషితో జిల్లాను మరింత ముందుకు తీసుకెళదాం..!

### జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి పిలుపు




కడప, మహి న్యూస్ ఆగస్టు 15: స్వాతంత్ర్య స్ఫూర్తితో దేశాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, వైఎస్ఆర్ కడప జిల్లాను మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు అధికారులు, ఉద్యోగులు, ప్రజలు సమష్టిగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి పిలుపునిచ్చారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం కలెక్టరేట్ ఆవరణలో జిల్లా కలెక్టర్ జాతీయ జెండాను ఆవిష్కరించి వందనం చేశారు. అనంతరం జిల్లా అధికారులు, ఉద్యోగులు, ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. 79 ఏళ్ల క్రితం స్వాతంత్ర్యం పొందిన భారతదేశం నేడు ప్రపంచంలోనే నాలుగో ఆర్థిక శక్తిగా ఎదిగిందని, అప్పటి



నుండి ఇప్పటివరకు దేశం సాధించిన అభివృద్ధి, ఆర్థిక ప్రగతి, పరిణామాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సిన అవసరం ఉందని కలెక్టర్ అన్నారు. ప్రపంచంలో భారత్ తనదైన స్థానాన్ని సుస్థిరం చేసుకుంటున్న తరుణంలో దేశాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. వైఎస్ఆర్ కడప జిల్లాలో చేపట్టిన పలు వినూత్న కార్యక్రమాలు దేశానికే స్ఫూర్తిగా నిలుస్తుండటం మనందరికీ గర్వకారణమని అన్నారు. ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని జిల్లాలో మరింత ఆరోగ్యవంతంగా, నాణ్యతతో చేపట్టిన "స్మార్ట్ కిచెన్" వ్యవస్థపై నీతీ ఆయోగ్ ప్రశంసలు లభించడం జిల్లా యంత్రాంగం చేపట్టిన వినూత్న ఆలోచనలకు, సమర్థవంతమైన అమలుకు లభించిన జాతీయ స్థాయి గుర్తింపుగా పేర్కొన్నారు. విద్యార్థులకు నాణ్యమైన, పోషక విలువలతో కూడిన భోజనం అందించడంతో పాటు ఆహార తయారీ, సరఫరా, పరిశుభ్రత, వ్యర్థాల నిర్వహణ వంటి అంశాలను సమర్థవంతంగా నిర్వహిస్తున్న స్మార్ట్ కిచెన్ వ్యవస్థ దేశంలోని ఇతర ప్రాంతాలకు కూడా ఆదర్శంగా నిలుస్తోందన్నారు. అంతేకాకుండా విద్యార్థుల్లో క్రమశిక్షణ, పరిశుభ్రత, పోషకాహారంపై అవగాహన పెంపొందించేందుకు చేపట్టిన "ప్రాజెక్ట్ ఏ ఎన్ టి ఎస్ " కూడా జిల్లాలో వినూత్న మార్పులకు నాంది పలుకుతోందని కలెక్టర్ తెలిపారు. యువతలోని సృజనాత్మక ఆలోచనలు, నూతన ఆవిష్కరణలకు కార్యరూపం ఇచ్చే ఉద్దేశంతో చేపట్టిన 'స్టార్ట్ అప్ కడప' ద్వారా ఏడాదికి 100 నూతన పరిశ్రమలను ఏర్పాటు చేసే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని జిల్లా కలెక్టర్ తెలిపారు. యువతలోని ప్రతిభను ప్రోత్సహించి, వారి ఆలోచనలను వ్యాపార అవకాశాలుగా మలచడంతో పాటు ఉపాధి కల్పించే స్థాయికి తీసుకెళ్లేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని పేర్కొన్నారు. జిల్లాను పెట్టుబడులకు అనుకూలమైన గమ్యస్థానంగా తీర్చిదిద్దే లక్ష్యంతో "ఇన్వెస్ట్ కడప" యువతలో నైపుణ్యాలను పెంపొందించి ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలను విస్తరించే లక్ష్యంతో స్టార్టప్ కడప వంటి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నామని కలెక్టర్ వివరించారు. భారీ పరిశ్రమలు, సౌర విద్యుత్ ప్రాజెక్టులు, సిమెంట్ పరిశ్రమల విస్తరణ వంటి పెట్టుబడులతో జిల్లాలో పారిశ్రామిక కార్యకలాపాలు విస్తరిస్తున్నాయని, తద్వారా ఉపాధి, ఆర్థిక అవకాశాలు పెరుగుతున్నాయని తెలిపారు. వ్యవసాయం, సాగునీరు, విద్య, వైద్యం, గ్రామీణాభివృద్ధి, మౌలిక వసతుల రంగాల్లో సమగ్ర అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలో అందుబాటులో ఉన్న వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవడంతో పాటు యువత నైపుణ్యాలను, పారిశ్రామిక అవకాశాలను సద్విని




యోగం చేసుకుని జిల్లా ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. దేశం సాధిస్తున్న ఆర్థిక వృద్ధికి అనుగుణంగా జిల్లాల ఆర్థిక ప్రగతి కూడా వేగవంతం కావాలని, అభివృద్ధి ఫలాలు సమాజంలోని ప్రతి వర్గానికి అందేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు చివరి వ్యక్తికి చేరేలా పనిచేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని జిల్లా అధికారులకు, ఉద్యోగులకు కలెక్టర్ సూచించారు. ప్రస్తుతం సాధించిన ప్రగతితో సంతృప్తి చెందకుండా భవిష్యత్ తరాలకు మరింత మెరుగైన, అభివృద్ధి చెందిన వైఎస్ఆర్ కడప జిల్లాను అందించడమే లక్ష్యంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు.

## శ్రీచైతన్య లో ఎగిరి మురిసిన త్రివర్ణపతాకం



గాలివీడు: ఆగష్టు15(మహి న్యూస్ ) : శనివారం 80 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను శ్రీచైతన్య కడప జిల్లా ఎ.జి. యం డి.రమణయ్య ఆధ్వర్యంలో ఘనంగా జరు పుకున్నారు. శ్రీ చైతన్య ఇంట ర్నేషనల్ బోర్డిం గ్ స్కూల్ (సి.బి. ఎస్.సి) లో నిర్వహించిన జెండావందనంలో ఆర్.ఐ. పి.మహబూబ్ బాషా, ప్రిన్సిపల్ కళాభారతి, వైస్ ప్రిన్సిపల్ జీవానందంతో కలిసి మువ్వన్నెల పతాకాన్ని ఎగురవేశారు.అంతకుముందు ఆయన శ్రీ చైతన్య విద్యాసంస్థల వ్యవస్థాప కుడు స్వర్గీయ డాక్టర్ బి.ఎస్ రావు పుట్టి నరోజును పురస్కరించుకుని ఆయన చిత్ర పటానికి పూలమాలవేసి జ్యోతి ప్రజ్వలన చేసి నివాళులు అర్పించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం కోసం పోరాడి తమ జీవితాలను ప్రాణాలను త్యాగంచేసిన మహనీయులను తలచుకుం టూ బాధ్యతగల పౌరులుగా మెలగాలని తన సందేశంలో పేర్కొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల అనంతరం ఆయన విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు.ఈ కార్యక్ర మంలో పిల్లలు వివిధ జాతీయ నాయకుల వేషధారణలతో అలరించారు.పదోతరగతి విద్యార్థులు ఒళ్ళు గగుర్పొడిచే పిరమిడ్ వ్యాయామాలు ప్రదర్శించారు.ఈ కార్య క్రమంలో డీన్ శ్రీనివాసులు ఇన్చార్జిలు నర్సింహులు, ప్రియ, ఏ.వో లతోబాటు ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సమానత్వం - సేవా స్ఫూర్తితో ప్రజలకు అంకితభావంతో పనిచేద్దాం

### జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ

మదనపల్లె, మహి న్యూస్, ఆగస్టు 15: 80వ స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ఉదయం మదనపల్లె జిల్లా కలెక్టరేట్ ఆవరణలో నిర్వహించిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ కలెక్టరేట్ ఆవరణలోని మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి గౌరవ వందనం స్వీకరించారు. వేడుకల్లో పాల్గొన్న విద్యార్థినీ, విద్యార్థులకు చాక్లెట్లు పంపిణీ చేసి స్వాతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ మాట్లాడుతూ..., భారత స్వాతంత్ర్యం కోసం తమ ప్రాణాలను అర్పించిన మహనీయుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని, వారి ఆశయాలను ఆచరణలోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్యం అంటే కేవలం రాజకీయ స్వేచ్ఛ మాత్రమే కాదని, ప్రతి పౌరుడు సమానంగా గౌరవం, న్యాయం పొందే సమాజ నిర్మాణమే నిజమైన స్వాతంత్ర్య స్ఫూర్తి అని పేర్కొన్నారు. 80వ స్వాతంత్ర దినోత్సవాన్ని శతాబ్దానికి చేరువవుతున్న చారిత్రక కలెక్టరేట్ భవనంలో జరుపుకోవడం విశేషమని, ఈ భవనం స్వాతంత్ర్యానికి ముందు, తర్వాత ఎన్నో చారిత్రక పరిణామాలకు సాక్షిగా నిలిచిందని పేర్కొన్నారు. ఈ చారిత్రక సందర్భంలో సమానత్వం, పారదర్శకత, సేవా స్ఫూర్తితో ప్రజలకు అంకితభావంతో పనిచేయాలని అధికారులకు పిలుపునిచ్చారు. ప్రభుత్వ అధికారులు ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందించే విధంగా పనిచేయాలని, ఎలాంటి పక్షపాతం లేకుండా ప్రతి ఒక్కరినీ సమానంగా చూడాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు అధికార కేంద్రాలుగా కాకుండా ప్రజాసేవా కేంద్రాలుగా మారాలని, ప్రజలు కలెక్టరేట్‌కు వచ్చినప్పుడు తమ సమస్యలకు న్యాయం జరుగుతుందనే నమ్మకం కలగాలని ఆయన అన్నారు. అనంతరం కలెక్టరేట్ ఆవరణలో ఇంచార్జ్ కలెక్టర్ మరియు డిఆర్ఓ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో వెంకటేశు, కేఆర్ఆర్సీ ఎస్డీసీ చంద్రశేఖర్ రెడ్డి, ఏఓ శ్రావణి, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కడపలో ఘనంగా 'అట్ హోమ్' కార్యక్రమం

### స్వాతంత్ర్య స్ఫూర్తితో జిల్లా అభివృద్ధికి సమష్టిగా కృషి చేద్దాం: జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి




కడప, మహి న్యూస్ ఆగస్టు 15: 80వ భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని కడపలోని జిల్లా కలెక్టర్ బంగ్లా ప్రాంగణంలో శనివారం సాయంత్రం 'అట్ హోమ్' కార్యక్రమం ఆహ్లాదకర వాతావరణంలో కన్నుల పండువగా జరిగింది. జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ తేనీటి విందుకు ప్రభుత్వ విప్, జమ్మలమడుగు ఎమ్మెల్యే చడిపిరాళ్ల ఆదినారాయణ రెడ్డి, జిల్లా ప్రధాన న్యాయమూర్తి యామినీ, జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, జిల్లా జాయింట్ కలెక్టర్ నిధి మీనా, సబ్ కలెక్టర్ హెచ్.ఎస్. భావన, డీఆర్వో మల్లికార్జునుడు, కడప నగర పాలక సంస్థ కమిషనర్ భవానీ ప్రసాద్, అదనపు కమిషనర్ రాకేష్ చంద్రం, కడప, జమ్మలమడుగు, బద్వేలు, పులివెందుల ఆర్డీఓలు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్ర్య స్ఫూర్తితో దేశ సమైక్యత, సమగ్రత కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు.






విధులు, బాధ్యతలను నిబద్ధతతో నిర్వహిస్తూ జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. జాయింట్ కలెక్టర్, సబ్ కలెక్టర్, ఆర్డీఓలు, అన్ని శాఖల అధికారుల సమన్వయంతో జిల్లాను మరింత అభివృద్ధి స్థాయికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధిలో వైఎస్ఆర్ జిల్లాకు ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలని అధికారులను కోరారు. అనంతరం జిల్లా కలెక్టర్, ఎస్పీ, జాయింట్ కలెక్టర్ తదితరులు ప్రతి టేబుల్ వద్దకు వెళ్లి అధికారులు, వారి కుటుంబ సభ్యులను పలకరించి పరిచయం చేసుకున్నారు.

#### ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



జిల్లా సాంస్కృతిక, పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కడప ముద్ర అకాడమీ, ప్రొద్దుటూరు నృత్య తరంగిణి కళా బృందాల ప్రదర్శనలతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు ప్రదర్శించిన నృత్య, గాన కార్యక్రమాలు అందరినీ అలరించాయి. కార్యక్రమాల్లో పాల్గొన్న కళాకారులను జిల్లా కలెక్టర్ జ్ఞాపికలతో సత్కరించారు. జిల్లా అధికారులు తమ కుటుంబ సభ్యులతో కలిసి సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని ఉల్లాసంగా గడిపారు.

EDITOR and PUBLISHER and OWNED BY NEELI RAMASUBBAIAH, PUBLISHED AT #1/704, PARK STREET, NEAR OLD BUSTAND, JAMMALAMADUGU-516434,YSR KADAPADIST, A.PPRINTED AT VSAR PRINTERS, YSR KADAPA DIST, 516004. RNI NO : APTEL/25/A0108. Cell 90 59 58 58 98. Email : mahinewsindia@gmail.com, website : https//epaper.mahinewsindia.com